epaper.ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, జులై 25, 2026 | సంపుటి - 22 | సంచిక 297 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్
- మకరధ్వజ్ గేట్ వద్ద విపక్ష ఎంపిల ఆందోళన
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విపక్షాల డిమాండ్

▸▸వివరాలు 2లో..




# నాడు చిల్లర కొట్టు.. నేడు వందల కోట్లు

## రూ.1000 కోట్ల పైమాటే అని ప్రచారం

ఆర్థిక నేరాల కోణంలో ఈడీ దర్యాప్తు అవసరమా..?

ఆదాయానికి మించిన ఆస్తులు...బినామీ పెట్టుబడులు..

కట్టలు కురిపిస్తున్న పిడిఎస్ రైస్ బిజినెస్

**(స్టేట్ బ్యూరో - నినాదం):**

***జగిత్యాల జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై వరుసగా వెలుగులోకి వస్తున్న కథనాలు ఇప్పుడు మరో కీలక చర్చకు దారితీ స్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా మళ్లించడం ద్వారా వందల కోట్ల రూపాయలు సంపాదించారని, ఒకప్పుడు సాధారణ పచారీ దుకాణం నిర్వహించిన వ్యక్తి నేడు కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు, రైస్ మిల్లులు, గోదాములు, భూములు, వాణిజ్య సంస్థలు, బినామీ పెట్టుబడులతో భారీ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించాడనే ప్రచారం నిజ మైతే... అది కేవలం సివిల్ సప్లైస్ లేదా పోలీసు కేసులతో ముగిసే అంశం కాదని నిపుణులు చెబుతున్నారు.***

ఇలాంటి సందర్భాల్లో ఆస్తుల అసలు మూలాలు, పెట్టుబడుల వనరులు, బ్యాంకు లావాదేవీలు, ఆదాయపు పన్ను రికార్డులు, బినామీ పేర్లలో ఉన్న ఆస్తులు, వ్యాపారాల మధ్య నగదు ప్రవాహం వంటి అంశాలు దర్యాప్తు సంస్థల దృష్టిలోకి వచ్చే అవకాశం ఉందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఈ వ్యవహారంపై అనేక కేసులు నమోదైనప్పటికీ, అక్రమ సంపాదన ద్వారా ఏర్పడిన ఆస్తులపై సమగ్ర ఆర్థిక దర్యాప్తు జరిగిందా లేదా అన్న ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

### కేసు కంటే.. డబ్బు ఎక్కడిదనేదే కీలకం

ఒక వ్యక్తి ప్రకటించిన ఆదాయానికి, అతని పేరుతో లేదా అతనికి సంబంధించిన వ్యక్తుల పేర్లతో ఉన్న ఆస్తులకు మధ్య అసాధారణ వ్యత్యాసం కనిపిస్తే, అది ఆదాయపు పన్ను శాఖ దృష్టిని ఆకర్షించే అంశంగా మారవచ్చు. ఒకప్పుడు చిన్న వ్యాపారం చేసిన వ్యక్తి కొద్దికాలంలోనే కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టాడనే ప్రచారం ఉంటే...
ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?
దానిపై పన్నులు చెల్లించారా?
ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించారా?
పెట్టుబడులకు చట్టబద్ధమైన ఆధారాలున్నాయా?
అనే ప్రశ్నలపై విచారణ జరిగే అవకాశం ఉంటుందని పన్ను నిపుణులు చెబుతున్నారు.

### మనీ ట్రయల్ బయటపడితే.. ED కూడా రంగంలోకి..?

అయితే, చట్టంలో పేర్కొన్న షెడ్యూల్డ్ నేరానికి సంబంధించిన అక్రమ ఆదాయాన్ని దాచడం, బదిలీ చేయడం లేదా చట్టబద్ధమైన ఆదాయంలా చూపే మనీ లాండరింగ్ అంశాలు దర్యాప్తులో బయటపడితే, సంబంధిత నిబంధనల ప్రకారం ED కూడా విచారణ చేపట్టే అవకాశం ఉంటుంది.
ఆ సందర్భంలో...
డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?
ఎవరెవరికి బదిలీ అయింది?
ఏ కంపెనీల్లో పెట్టుబడిగా మారింది?
విదేశీ లావాదేవీలు ఉన్నాయా?
బినామీల ద్వారా ఆస్తులుగా మార్చారా?
అనే అంశాలను లోతుగా పరిశీలించే అవకాశం ఉంటుంది.




### బినామీ ఆస్తులుంటే...?

**దర్యాప్తులో ఆస్తులు ఇతరుల పేర్లలో ఉన్నప్పటికీ అసలు యాజమాన్యం మరొకరిదేనని ఆధారాలతో తేలితే, *Benami Property Transactions Act* ప్రకారం సంబంధిత ఆస్తులపై చర్యలు తీసుకునే ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది. భూములు, గోదాములు, రైస్ మిల్లులు, వాహనాలు, కంపెనీల షేర్లు, బ్యాంకు పెట్టుబడులు, కుటుంబ సభ్యులు లేదా సన్నిహితుల పేర్లలో ఉన్న ఆస్తులు కూడా విచారణ పరిధిలోకి రావచ్చు.**

### ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు..!

- పచారీ కొట్టు నుంచి కోట్లాది రూపాయల వ్యాపార సామ్రాజ్యం ఎలా ఏర్పడింది?
- ప్రచారంలో ఉన్న రూ.1000 కోట్ల ఆస్తులకు చట్టబద్ధమైన ఆధారాలున్నాయా?
- బినామీల పేర్లలో ఉన్న ఆస్తులపై ఎప్పుడైనా సమగ్ర విచారణ జరిగిందా?
- ప్రభుత్వ సబ్సిడీ బియ్యం అక్రమ రవాణా ద్వారా వచ్చిన నిధులపై ఆర్థిక దర్యాప్తు జరిగిందా ?
- పన్ను ఎగవేత, బినామీ పెట్టుబడులు, మనీ లాండరింగ్ కోణాలను సంబంధిత సంస్థలు నేటికీ ఎందుకు పరిశీలించలేదు..?

### ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖ ఏమేం పరిశీలించాలి ?

- ✓ ఆదాయానికి మించిన ఆస్తులు
- ✓ ఆదాయపు పన్ను రిటర్నులు
- ✓ బ్యాంకు ఖాతాల లావాదేవీలు
- ✓ భారీ నగదు డిపాజిట్లు
- ✓ భూముల కొనుగోళ్లు
- ✓ రైస్ మిల్లులు, గోదాముల పెట్టుబడులు
- ✓ కుటుంబ సభ్యులు, బినామీల పేర్లలో ఉన్న ఆస్తులు
- ✓ GST, ROC, రిజిస్ట్రేషన్ రికార్డులు
- ✓ అవసరమైతే సెర్చ్ & సీజ్ మొదలగు చర్యలు

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష



***నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆరఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.***

▸▸తరువాయి 2లో..

**హైదరాబాద్,జూలై24(నినాదం):**

పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు.



# బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి

- సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం
- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ
- సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై24(నినాదం):**

సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 ` 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు.

▸▸తరువాయి 2లో..

## 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

- విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయి పర్యటనలతో సమీక్షిస్తున్నాం
- భద్రాద్రి జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

▸▸వివరాలు 2లో..

## ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం

- డిజిటల్ అడ్వర్‌టైజింగ్ హబ్‌లుగా మీ సేవ కేంద్రాలు
- చిన్న వ్యాపారాలకు అందుబాటులోకి డిజిటల్ మార్కెటింగ్ సేవలు

▸▸వివరాలు 2లో..

## ఇప్పుడు మౌనం వహిస్తే..

# మరెప్పుడూ ప్రశ్నించలేం

- విద్యార్థుల భవిష్యత్ కోసమే మా ఆందోళన
- అస్సలు వెనక్కి తగ్గేది లేదు
- కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి



### కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం
- విద్యార్థులపై కేసులను ఎత్తివేయాల్సిందే
- కేంద్రమంత్రులకు తేల్చి చెప్పిన సిజెపి ప్రతినిధులు



వివరాలు 2

## ఢిల్లీ ఆందోళన

# ముసుగులో అరాచక శక్తులు

వివరాలు 6

- పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు
- పోలీసులు, జర్నలిస్టులపై దాడులకు తెగించారు
- నిజమైన విద్యార్థుల చేతుల్లో రాళ్లు ఎక్కడినుంచి వచ్చాయి
- విపక్షాలు పార్లమెంట్‌కు రాకుండా ఎగదోసే కార్యక్రమం చేశాయి
- దుష్ప్రచారం చేస్తున్న పాక్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లు సీజ్
- గతంలో అన్ని రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయితే వారంతా రాజీనామా చేశారా
- మీడియా సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



## ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు

- పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
- జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

▸▸వివరాలు 2లో..



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

▸▸వివరాలు 2లో..

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే




- ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్
- కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస్ సంఘీభావం

**హైదరాబాద్,జూలై24(నినాదం):**

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు.

▸▸తరువాయి 2లో..

## సిజెపి ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లూ లేవు

- వాటిని విచారించకుండా తిరస్కరించారని ఎలా రాస్తారు
- మీడియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్



### పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

- శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి
- నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం

▸▸వివరాలు 2లో..

# నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

**న్యూఢిల్లీ,జూలై24(నినాదం):**

లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ యుజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

**మకరధ్వజ్ గేట్ వద్ద**

**విపక్ష ఎంపిల ఆందోళన**

నీట్ యజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేస్తోంది. వరుసగా ఐదో రోజు శుక్రవారం పార్లమెంట్‌లోని 'మకర్ ద్వార' వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసన ప్రదర్శన కొనసాగించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, లేదా ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విపక్ష ఎంపీలు ప్లకార్డులు చేతబూని నినాదాలతో హోరెత్తించారు. గురువారం మకర్ ద్వార్ వద్ద అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు పరస్పర నిరసనలతో ఎదురెదురుగా నిలబడి ఆందోళన చేపట్టడం ఉద్రిక్తతకు దారితీసింది. చర్చను ప్రతిపక్షాలే అడ్డుకుంటున్నాయని ఎన్డీఏ ఆరోపిస్తుండగా, విద్యాశాఖ మంత్రి రాజీనామాకే విపక్షాలు పట్టుబడుతున్నాయి. నీట్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వీడియో సందేశం విడుదల చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. 'పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రధాని తన వ్యాఖ్యలను సభలోనే వినిపించాలి తప్ప, బయట రాత్రివేళల్లో రికార్డ్ చేసిన వీడియోలతో ఒంటెద్దు పోకడ 'మన్ కీ బాత్' చెప్పడం సరికాదు. ప్రధాని మోదీ.. ఈరోజు పార్లమెంట్‌కు వచ్చేముందు ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించండి. ఆందోళనకారులపై లాఠీఛార్జ్, ప్లెలెట్ గన్ల ప్రయోగానికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోండి. ఆ తర్వాతే విద్యావ్యవస్థపై సమగ్ర చర్చకు మేం సిద్ధం' అని ఖర్గే అన్నారు.

## ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

**న్యూఢిల్లీ,జూలై24(నినాదం):**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏవీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోలేమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




నిరసన కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లామని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కీలక చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

**మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

నీట్ పేపర్ లీకుకు కేంద్రం బాధ్యత తీసుకోవాలంటూ పట్టుబడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు కొందరు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా వ్యవస్థలో కీలక అంశాలపై చర్చించారు. దాదాపు గంటన్నరపాటు ఈ చర్చలు జరిగాయి. తమ డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్ర మంత్రులు స్పందిస్తూ తమకు ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో, రేపు మరోసారి భేటీ అయ్యేందుకు ఇరు వర్గాలు నిర్ణయించాయి. కేంద్ర మంత్రులతో సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు 3 ప్రధాన డిమాండ్లు పెట్టామని సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ తెలిపారు. మా డిమాండ్ల పట్ల కేంద్రం సానుకూలంగా ఉందని అన్నారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి రేపటి వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు. కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధుల మధ్య చర్చలు ముగిశాయి. ప్రధాన్ రాజీనామా తప్ప మిగతా రెండు డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌పై రేపు మధ్యాహ్నం వరకు ప్రభుత్వం సమయం కోరిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆయనను పదవి నుంచి తొలగిస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 2గంటలపాటు జరిగిన ఈ సమావేశానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ హాజరుకాగా.. సీజేపీ తరపున పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా వెళ్లారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని సీజేపీ డిమాండ్ చేసింది. అది నెరవేరకపోతే ఉద్యమం మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది. ప్రధాన్ వైదొలిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని పునరుద్ఘాటించింది.

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం

**హైదరాబాద్,జులై 24(నినాదం):**

తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీ సేవ ఆధ్వర్యంలో, అంతర్జాతీయంగా పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పాల్గొన్నారు. మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రకటనలను రూపొందించడం, వాట్సప్ బిజినెస్ ఎకౌంట్ ను క్రియేట్ చేయటం, తమ ఉత్పత్తులను ఆ ఎకౌంట్ ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, డిజిటల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. కార్యక్రమం ద్వారా కిరాణా షాప్స్, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద సంస్థలు తదితర అన్ని రకాల వ్యాపారాలు తమ సమీపంలోని మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫెషనల్ డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందుతాయి. మీసేవా నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల ప్రచురణ తదితర అంశాల్లో పూర్తి సహాయాన్ని అందిస్తారు. దీంతో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలకు మరింత ప్రచారం కల్పించుకొని, ఎక్కువ మంది వినియోగదారులను చేరటం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది.

## 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై24(నినాదం):**

సింగరేణి బొగ్గు బ్లాకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే సంస్థ ఉనికికే తీవ్ర ప్రమాదమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేలంలో పాల్గొనకపోవడం వల్లే రెండు బొగ్గు బ్లాకులు ప్రైవేటు పరం అయ్యాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిని మార్చి సింగరేణిని వేలం పాటల్లో పాల్గొనేలా అనుమతులు ఇచ్చామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రాబోయే 20 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక సమన్వయంతో సరిచేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం బిఆర్‌ఎస్, బిజెపిలు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపకుండా, తాడిచెర్ల బ్లాక్‌ను అడ్డుపెట్టుకుని ఇప్పుడు సింగరేణిపై నకిలీ ప్రేమ ఒలకబోస్తున్నారని, ఈ విషయాన్ని కార్మికులు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్‌కు తగ్గట్టుగా సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే నేడు తీవ్ర బొగ్గు కొరతను ఎదుర్కోవాల్సి వస్తోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని భట్టితదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. గనిలోకి స్వయంగా వెళ్లి బొగ్గు నాణ్యతను పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి, గని పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించాను. రాష్ట్ర భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వేలం ప్రక్రియలో చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను సొంతం చేసుకోవాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడం శుభపరిణామం. అలాగే భవిష్యత్ అవసరాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ కూడా సింగరేణికే దక్కేలా మన ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భట్టి అన్నారు.

## సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి

**యువతను ఫాలో కావడం అవసరమే**

**కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన**

న్యూఢిల్లీ : యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు



ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆరఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు

**హైదరాబాద్,జులై 24(నినాదం):**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సవి□క్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శా□స్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయ



నాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు. న్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయని వెల్లడించారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందు ఉంచాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాకుండా బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం. ప్రతి నిర్ణయం శా□స్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు. పాలమూరు `రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు.

## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

న్యూఢిల్లీ,జూలై24(నినాదం):

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది.

## సిజెపి ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు


**న్యూఢిల్లీ,జూలై24(నినాదం):**

'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సీజేఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సీజేపీ ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం అని సీజేఐ అన్నారు. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీం కోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సీజేఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..' మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది.

# బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి

సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేట్ కరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంప సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలోబెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల`2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని అన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి

అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 ` 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్




వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అధికారులకు దిశా నిర్దేశంచేశారు.

# ఆగస్టు 15లోగా ఏకరూప దుస్తులు

- ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు చేసిన రైతులు నష్టపోకుండా చూడండి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ, గురుకులాలు, మోడల్ స్కూల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆగస్టు 15 లోగా కొత్త ఏకరూప దుస్తులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి డీఆర్డీఓ పీడీ ని ఆదేశించారు. శుక్రవారం విద్యార్థుల ఏకరూప దుస్తుల అందజేత పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి వివరిస్తూ ఈసారి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా లైట్ బ్లూ షర్ట్, డార్క్ బ్లూ ప్యాంట్ తో కూడిన ఒక్కొక్కరికి రెండు జతల ఏకరూప దుస్తులు అందజేయడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా టిజికో/మఫత్ లాల్ ద్వారా మండలాలకు బట్ట అందజేయడం జరుగుతుందని తెలిపారు. నాణ్యమైన దుస్తులు కుట్టడానికి ఇప్పటికే మాస్టర్ ట్రైలర్ ల ద్వారా గుడ్డ కత్తిరించడం, కుట్టడం పై స్వయం సహాయక సంఘాల టైలర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, సకాలంలో నాణ్యమైన దుస్తులు కుట్టించి ప్రతి విద్యార్థికి అందజేసే విధంగా జిల్లా కలెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని 512 పాఠశాలల్లో 38653 విద్యార్థులు, 15 కేజీబీవీల్లో 4531 మంది విద్యార్థులు, 3 మోడల్ స్కూళ్లలో 1919 విద్యార్థులు, గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వడానికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో శిక్షణ పొందిన 358 స్వయం సహాయక సంఘాల టైలర్లను గుర్తించడం జరిగిందని, మండలాలకు ఇప్పటి వరకు వచ్చిన గుడ్డను ఎప్పటికప్పుడు విభజించి దుస్తులు కుట్టేందుకు టైలర్లకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆగస్ట్ 15 లోగా ప్రతి విద్యార్థికి ఒక జత ఏకరూప దుస్తులు, ఆగస్టు 25 లోగా రెండవ జత అందజేసే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఆర్డిఒ. ను ఆదేశించారు.

**రైతులు పండించాల్సిన పంటలపై అవగాహన కల్పించాలి..**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పండించాల్సిన పంటలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలు, సమస్యాత్మక గ్రామాలు, ఇప్పటి వరకు జరిగిన సాగు విస్తీర్ణంపై వ్యవసాయ అధికారికి దిశా నిర్దేశం చేశారు. పంట వారీగా సరైన ప్రణాళిక వేసుకోవాలని అందుకు తగ్గట్టు విత్తనాలు, ఎరువులు అందజేయాలని సూచించారు. కందులు, నువ్వులు, వేరుసెనగ వంటి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో కూరగాయల సాగు సైతం పెంచే విధంగా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హైదరాబాద్ నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ గ్రామీణాభివృద్ధి శాఖ దానకిషోర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దివ్య దేవరాజ్, వనపర్తి జిల్లా నుండి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, ఇంచార్జి జిల్లా విద్యా శాఖ అధికారి యాదయ్య, డీఆర్డిఒ పీడీ ఉమాదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI
**మల్కాజిగిరి బ్రాంచ్**
చిరునామా : నెం. 13-77 & 13-77/1, గాంధీ పార్క్ ఎదురుగా, మల్కాజిగిరి మెయిన్ రోడ్, హైదరాబాద్ - 500047.

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 14.05.2026**తో జారీ చేసిన **డిమాండ్ నోటీసు** ప్రకారం రుణగ్రహీతలు **శ్రీ గంభీర్రావు సంప్రీత్ కుమార్,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 **మరియు సహ-రుణగ్రహీత శ్రీమతి గంభీర్రావు సాయి సంహిత,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తం **రూ. 48,42,988.53/-** ప్లస్ వడ్డీ రేటు 10.00% వంతున దానిపై తదుపరి వడ్డీ స్టార్ హోమ్ రుణం **రూ. 35,32,302/-** మరియు వడ్డీ రేటు 10.50% వంతున స్టార్ టాప్ అప్ లోన్ **రూ. 13,10,686.53/-** నెలవారి వాయిదాలలో చక్రవడ్డీ మరియు బ్యాంకు భరించిన అన్ని వ్యయాలు, ఛార్జీలు, ఖర్చులను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీత **శ్రీ గంభీర్రావు సంప్రీత్ కుమార్,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 **మరియు సహ-రుణగ్రహీత శ్రీమతి గంభీర్రావు సాయి సంహిత,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 వారిని బకాయి మొత్తం చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ దిగువ సంతకముదారు ఈ క్రింద తెలిపిన ఆస్తిని **తేది: 21 జులై, 2026న స్వాధీనము** చేసుకోవడమైనదని రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి **శ్రీ గంభీర్రావు సంప్రీత్ కుమార్,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 **మరియు సహ-రుణగ్రహీత శ్రీమతి గంభీర్రావు సాయి సంహిత,** నివాసం: ఫ్లాట్ నెం. 101, వెలుములాస్ ఎలెగన్స్, గ్రీన్‌ల్యాండ్ ఎన్‌క్లేవ్, జొన్నబండ, అల్వాల్ గ్రామం, మేడ్చల్-మల్కాజిగిరి - 500010 మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడ మేమనగా సదరు ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే **బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెందవలసిన రుణ బకాయి మొత్తం **రూ. 48,42,988.53/-** ప్లస్ వడ్డీ రేటు 10.00% వంతున దానిపై తదుపరి వడ్డీ స్టార్ హోమ్ రుణం **రూ. 35,32,302/-** మరియు వడ్డీ రేటు 10.50% వంతున స్టార్ టాప్ అప్ లోన్ **రూ. 13,10,686.53/-** నెలవారి వాయిదాలలో చక్రవడ్డీ మరియు బ్యాంకు భరించిన అన్ని వ్యయాలు, ఛార్జీలు, ఖర్చుల క్రింద వర్తించును.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను మరియు సహ-రుణగ్రహీతలను కోరడమైనది.

**స్థిరాస్తి పూర్తి వివరణ**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, జిహెచ్ఎంసి అల్వాల్ సర్కిల్ క్రింద, అల్వాల్ గ్రామం (కొత్తగా ఏర్పడి అల్వాల్ మండలం) జొన్నబండ, గ్రీన్‌ల్యాండ్స్ ఎన్‌క్లేవ్‌లో గల సర్వే నెం.లు 21 మరియు 577 లో ప్లాట్ నెం. 32పై ఆవరణ ఇంటి నెం. 5-16/32 పై నిర్మించిన "వెలుములాస్ ఎలెగన్స్" గా పిలువబడే భవనంలో 42 చ.గ.లు లేదా 35.11 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణం (600 చ.గ.లలో) భూమి అవిభాజ్యవాటాతోపాటు 1025 చ.అ.లు (కామన్ ఏరియా మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) బిల్టప్ ఏరియాతో మొదటి అంతస్తులో నివాస ఫ్లాట్ నెం. 101 యావత్తు. **భూమి సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 33, **దక్షిణం:** 30' వెడల్పు రోడ్డు, **తూర్పు:** 40' వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 49. **ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశం.

ప్రదేశం : హైదరాబాద్
తేది: 21.07.2026
అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

BAJAJ FINANCE
**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, కేరాఫ్ బజాజ్ ఆటో లిమిటెడ్ కాంప్లెక్స్, ముంబయి పూణె రోడ్, అకుర్ది పూణె 411035.
కార్పొరేట్ ఆఫీస్: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆఫీస్: పూణే-అహ్మద్‌నగర్ రోడ్, విమన్ నగర్, పూణె 411014
బ్రాంచ్ ఆఫీస్: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎస్ఆర్ అనంతుల కాంప్లెక్స్, 1వ అంతస్తు, 1 4 249 153 1 ఎంజి రోడ్, సూర్యాపేట, తెలంగాణ 508216, అధీకృత అధికారి వివరాలు: పేరు: యెండూరి కుమార్, ఇ-మెయిల్ ఐడి : yenduri.kumar@bajajfinserv.in, మొబైల్ నెం. +91 7799468198/8074464573

అనుబంధం-IV-A (రూల్ 8(6)కు నిబంధనలు చూడుము)
**SARFAESI చట్టం 2002 క్రింద ఇ-వేలం అమ్మకం ప్రకటన**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") క్రింద యాక్ట్ స్థిరాస్తిల అమ్మకం

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL") లో తనఖా పెట్టిన దిగువ తెలిపిన ఆస్తికి సంబంధించి ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానికానికి మరియు రుణగ్రహీతలు / సహ -రుణగ్రహీతలు / తనఖాదారు (ల) కు తెలియజేయునది ఏమనగా, చట్టంలోని నిబంధనల క్రింద BFL అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుచే దిగువ తెలిపిన ఆస్తి స్వాధీనము చేసుకోబడినది, అది దిగువ తెలిపిన మొత్తం మరియు తదుపరి వర్తించు వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు మొదలైనవి రాబట్టుకొనుటకు వేలం ద్వార విక్రయించబడును.
దిగువ తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులు దిగువ తెలిపిన మొత్తం బకాయిలను రాబట్టుకొనుటకు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ (ది రూల్స్) లోని రూల్ 8 & 9 క్రింద **"ఎక్కడ ఏలా ఉన్నదో అక్కడ అలానే, ఉన్నది ఉన్నట్లుగా మరియు ఆక్కడ ఏమున్నదో అదే ప్రాతిపాదికపై"** విక్రయించబడును :

**ఇ-వేలం వివరములు**

| | |
|---|---|
| రుణగ్రహీత పేరు & చిరునామా | **1. శ్రీ సూర్య ఎంటర్‌ప్రైజెస్,** దాని ప్రొప్రైటర్ **రాధాకృష్ణ వెంపటి,** నివాసం: డి.నెం. 1-2-147/ఎ/1 ఇ సేవా దగ్గర, మున్సిపల్ క్వార్టర్స్ లేన్ సూర్యాపేట తెలంగాణ 508213, **మరియు** : నివాసం: ఫ్లాట్ నెం. 102 ఇ.నెం. 1-1-517/2/18 వార్డ్ నెం. 1 బ్లాక్ నెం. 1 మొదటి అంతస్తు సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్ సర్వే నెం. 265 బెచిరాగ్ మాధారం ఆర్‌వి సూర్యాపేట 508213 తెలంగాణ **2. వెంపటి భాగ్యలక్ష్మి భర్త వెంపటి రాధా కృష్ణ** నివాసం: ఇ.నెం. 1-2-147/ఎ/1 మున్సిపల్ క్వాటర్స్ లేన్, ఇ సేవా దగర, సూర్యాపేట నల్గొండ 508213 తెలంగాణ **3. రాధాకృష్ణ వెంపటి తండ్రి వెంపటి సూరయ్య** నివాసం: ఇ.నెం. 1-2-147/ఎ/1 మున్సిపల్ క్వాటర్స్ లేన్, ఇ సేవా దగర, సూర్యాపేట నల్గొండ 508213 టిజి, సంప్రదించండి- 9848125627 ఇమెయిల్ ఐడి - vempathiradhakrishna1@gmail.com |
| రుణ ఖాతా నెం. | **P6H2PBL10326561** |
| సెక్షన్ 13(2) క్రింద చట్టబద్ధమైన డిమాండ్ నోటీసు తేది & మొత్తం | నోటీసు తేది 12.05.2025 డిమాండ్ మొత్తం రూ. 33,95,991/- |
| 24.07.2026 నాటికి రావలసిన బకాయి మొత్తం | రూ. 39,05,718.95/- (రూపాయలు ముప్పై తొమ్మిది లక్షల ఐదు వేల ఏడు వందల పద్దెనిమిది మరియు పైసలు తొంభై ఐదు మాత్రమే) |
| స్థిరాస్తి వివరణ | తెలంగాణ - 508213, సూర్యాపేట, బెచిరాగ్ మాధారం ఆర్‌వి వద్ద గల బ్లాక్ నెం. 1, వార్డు నెం. 1 లోని సర్వే నెం. 265 లో 495 చ.అ.ల విస్తీర్ణం కామన్ ఏరియాలో దామాషా వాటాతోపాటు సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్, ఇంటి నెం. 1-1-517/2/18 గల మొదటి అంతస్తులో ఫ్లాట్ నెం. 102 యావత్తు. **ఫ్లాట్ నెం. 102 సరిహద్దులు : తూర్పు :** ఖాళీ ప్రదేశం మరియు మెట్లు, **పడమర :** లిఫ్ట్ మరియు ఖాళీ ప్రదేశం, **ఉత్తరం :** కారిడార్, **దక్షిణం :** ఖాళీ ప్రదేశం. **అపార్ట్‌మెంట్ / భూమి సరిహద్దులు: తూర్పు:** ఎస్. బసవరావు స్థలం, **పడమర :** 30 అ.ల రోడ్డు, **ఉత్తరం :** జనార్ధన్ రెడ్డి మరియు ఇతరుల ఇండ్లు, **దక్షిణం :** 16 అ.ల రోడ్డు. |
| రిజర్వు ధర ఐఎన్ఆర్ లో | రూ. 31,51,440/- (రూపాయలు ముప్పై ఒక్క లక్షల యాభై ఒక్క వేల నాలుగు వందల నలభై మాత్రమే) |
| బయాన | రూ. 3,15,144/- |
| ఇ-వేలం తేది & సమయం | 11.08.2026న ఉ. 11.00 నుండి మ. 1.00 గం.ల వరకు |
| ఇ-వేలం పోర్టల్ | https://bankauctions.in |
| బయాన దాఖలుకు ఆఖరి తేది | 10/08/2026 |
| బిడ్ పెంపుదల మొత్తం రూ.లలో | రూ. 25,000/- |
| సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు | తెలియదు |
| ఆస్తి తనిఖీ తేది | తేది: 26.07.2026 నుండి 10.08.2026 వరకు పని రోజులలో ముందస్తు అనుమతితో ఉ॥ 9.30 నుండి సా॥ 5 గం.ల వరకు |

సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా షెడ్యూల్ లో తెలిపిన తేదీన ఏ కారణంగానైనా వేలం విఫలమైతే, సెక్యూర్డ్ క్రెడిటార్ విచక్షన మేరకు ప్రైవేటు ఒప్పందం ద్వారా అమ్మకం ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్ ను సెక్యూర్డ్ క్రెడిటార్ వారు అమలు చేయుదురు. అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు లింక్ https://bankauctions.in మరియు https://www.bajajfinserv.in/auction-notices రెఫర్ చేయవలెను.

తేది: 24.07.2026
ప్రదేశం: పూణె
అధీకృత అధికారి
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

## బీఆర్ఎస్ పార్టీలోకి కొనసాగుతున్న వలసలు

**చిన్నగుంటపల్లి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరిక**

**సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (నినాదం):** వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నిరంజన్ రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాత,కొత్త వాళ్ల కలియికతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కందూరు శాంతయ్య, దండు లక్ష్మయ్య, కందూరి ఎల్లయ్య, చిన్న వెంకటస్వామి, దండు రాజు, పానుగంటి రాజు, గొర్ల సతీష్, పానుగంటి గోపాల్, గొర్ల రమేష్, పానుగంటి మహేష్, గొర్ల రాజు, చరణ్, ఆర్కటం ఆంజనేయులు, గున్న చంద్రారెడ్డి, పోతురాజు బాలయ్య, మధు, పానుగంటి రవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, చిట్యాల రాము, పానుగంటి రాము, ధర్మ శాస్త్రి, భగవంతు యాదవ్, మైకెల్, పుల్లయ్య, బాలయ్య, పి.రాము, రాజేశ్వర్ రెడ్డి, శంషుద్దీన్, విష్ణు, కొమ్ము రాము, స్వామి, జి.రాజు ఉన్నారు.

## నీట్ లిక్‌పై నల్ల బ్యాడ్జీలతో నిరసన



**మోతె,జులై 24 (నినాదం):** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మూతికి నల్ల గుడ్డ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**మోతె, జులై 24 (నినాదం) :**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను శుక్రవారం మోతె మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కేటీఆర్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఏలూరు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఆరే లింగారెడ్డి, నూకల శ్రీనివాస్‌రెడ్డి, కాంపాటి వెంకన్న, గుగులోతు శంకర్, షేక్ జానీ పాషా, ఇండ్ల వెంకటేశ్వర్లు, బానోత్ వెంకన్న, పిట్టల నాగేష్, బానోత్ గాంధీ, బాబు, సాజ్యా నాయక్, మహేందర్, రవి,కుక్క బిక్షం,నవీన్, సుధాకర్,రాము, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన డీఎస్పీ



**చింతపల్లి, జూలై 24 (నినాదం):** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న పరిపాలనా విధానాలు, నేరాల నమోదు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీకి సీఐ రాజులు, ఎస్సై ముత్యాల రామ్మూర్తి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ పోలీసు వందనం స్వీకరించారు. స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేసి, ఇదే పనితీరును కొనసాగించాలని పోలీసు సిబ్బందిని అభినందించారు.

### అసంపూర్తి రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసి

# ప్రజలకు అందుబాటులోకి తేవాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- స్వయంగా రహదారిని పరిశీలించి అధికారులకు ఆదేశాలు



**యాదాద్రి భువనగిరి జూలై 24 (నినాదం ):** ఆలేరు నియోజకవర్గం లోని ఆత్మకూరు మండలం నుండి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. శుక్రవారం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే ఆగి రోడ్డు పరిస్థితిని స్వయంగా పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి రోడ్డు పరిస్థితిని పరిశీలించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌తో మంత్రి చరవాణీ లో మాట్లాడి పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై వివరణ కోరారు. కాంట్రాక్టర్ కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా యాదగిరిగుట్ట-- తుర్కపల్లి రహదారిలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులో పనులు ప్రారంభించకపోతే సంబంధిత టెండర్‌ను రద్దు చేసి, ఇతర ఏజెన్సీలకు అప్పగించి రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయిస్తామని మంత్రి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలిగేలా పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. దీనికి స్పందించిన కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని, ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆర్ అండ్ బి అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (నినాదం):** భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఖిల్లా ఘనపూర్ మండలంలోని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామమైన మల్కాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామాన్ని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం ప్రత్యేక అవకాశమని అన్నారు. భూముల రికార్డులను సమగ్రంగా, పారదర్శకంగా నవీకరించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, డిజిటల్ భూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ల్యాండ్ రీ-సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, రైతులు తమ భూముల సరిహద్దుల నిర్ధారణలో రెవెన్యూ, సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామస్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎల్-నినో ప్రభావంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రాబోయే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, స్వల్పకాలిక పంట రకాల ఎంపిక, బిందు సేద్యం (మైక్రో ఇరిగేషన్) వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ఉద్యానవన పంటల సాగులో నేల తేమను కాపాడుకునే చర్యలు చేపట్టడంతో పాటు, దిగుబడి తగ్గకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఎల్-నినో ప్రభావానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు, సాంకేతిక సూచనలను క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం అందిస్తూ అందుబాటులో ఉండాలని మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు (ఏఓలు), ఉద్యానవన అధికారులు, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చదువుల తల్లికి అండగా ఎమ్మెల్యే జిఎంఆర్..

- ఉన్నత విద్య కోసం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం..
- బాసర ట్రిపుల్‌ఐటీలో చేరనున్న విద్యార్థిని హర్షినికి ఉన్నత చదువులకు భరోసా..



**పటాన్చెరు, జూలై 24 (నినాదం):** పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదన్న సంకల్పంతో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఉన్నత విద్యను కొనసాగించే అవకాశాన్ని ఆర్థిక ఇబ్బందుల కారణంగా కోల్పోయే పరిస్థితిలో ఉన్న ఓ నిరుపేద విద్యార్థినికి రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి ఆమె విద్యా భవిష్యత్తుకు అండగా నిలిచారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని హర్షిని, 574 మార్కులతో ప్రతిష్ఠాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఫీజులు చెల్లించడం సాధ్యం కాక, ఉన్నత విద్యపై ఆశలు సన్నగిల్లాయి. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి ధైర్యం చెప్పడంతో పాటు, బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరు సంవత్సరాల విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజుల నిమిత్తం రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులు కేవలం ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో హర్షిని ఉన్నత విద్యాభ్యాసానికి అండగా నిలిచామని తెలిపారు. భవిష్యత్తులోను సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అందించిన సహాయానికి విద్యార్థిని హర్షిని, ఆమె కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ..

- పరిశీలించిన కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ ముదిరాజ్

**రాజేంద్రనగర్, జూలై 24 (నినాదం):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని 122వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దొంత్రమోని ప్రవీణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం 122వ డివిజన్ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఆయన బూత్ లెవెల్ ఆఫీసర్ల తో కలిసి పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల పరిధిలో సాగుతున్న కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు దరఖాస్తు పత్రాల పరిశీలన ప్రక్రియ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతను పాటించాలని అధికారులను కోరారు. అర్హత ఉన్న ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఓలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**ఆక్సిజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్**
CIN: L24110TG1990PLC012038
రిజిస్టర్డ్ ఆఫీస్ : సర్వే నెం. 252/1, అరూర్ గ్రామం, సదాశివపేట్ మండలం, మెదక్, తెలంగాణ - 502291
కార్పొరేట్ ఆఫీస్ : లెవెల్-1 ప్లాట్ నెం. బి1 మరియు బి2, ఐడిఎ గాంధీ నగర్, బాలానగర్ టౌన్‌షిప్, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ, ఇండియా - 500037. ఫోన్ : 08455-250280 / 250080
Email: cs@oxygentapharma.com, Website: www.oxygentapharma.com

**బహిరంగ ప్రకటన - 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక సర్వసభ్య సమావేశం**


**ఆక్సిజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ ("కంపెనీ")** యొక్క 33వ వార్షిక సర్వసభ్య సమావేశం ("AGM") శుక్రవారం, 21 ఆగస్టు, 2026న ఉ. 10:30 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ("VC") మరియు ఇతర ఆడియో-విజువల్ సాధనాల ("OAVM") ద్వారా నిర్వహించబడుతుందని మీకు తెలియజేస్తున్నాము. AGM నోటీసులో పేర్కొన్న విధంగా కార్యకలాపాలు నిర్వహించడానికి ఈ సమావేశం జరుగుతుంది. కంపెనీల చట్టం, 2013 ("చట్టం") మరియు దాని క్రింద రూపొందించిన నిబంధనలు, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క వర్తించే నిబంధనలకు అనుగుణంగా మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ("MCA") మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("SEBI") జారీ చేసిన అన్ని వర్తించే సర్క్యులర్‌లతో కలిపి నిర్వహించబడుతుంది.
కంపెనీ వార్షిక నివేదికతో పాటు AGM నోటీసును, కంపెనీ / డిపాజిటరీ పార్టిసిపెంట్(ల) వద్ద ఇ-మెయిల్ చిరునామాలను నమోదు చేసుకున్న కంపెనీ వాటాదారులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో పంపబడుతుంది. వర్తించే MCA మరియు SEBI సర్క్యులర్‌ల ద్వారా AGM నోటీసు యొక్క భౌతిక కాపీని పంపవలసిన అవసరం నుండి మినహాయింపు ఇవ్వబడింది. అయితే, తమ DP ID మరియు క్లయింట్ IDని పేర్కొంటూ, cs@oxygentapharma.com వద్ద ప్రత్యేకంగా అభ్యర్థించే వాటాదారులకు AGM భౌతిక నోటీసు పంపబడుతుంది.
వార్షిక నివేదికతో పాటు AGM నోటీసు, కంపెనీ వెబ్‌సైట్ https://www.oxygentapharma.com/ లో, కంపెనీ ఈక్విటీ షేర్లు లిస్ట్ చేయబడిన స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్, అంటే BSE లిమిటెడ్ www.bseindia.com లో కూడా అందుబాటులో ఉంటుందని వాటాదారులు గమనించగలరు.
భౌతిక వాటాదారులు దయచేసి ఫోలియో నెంబర్, వాటాదారు పేరు, వాటా ధృవపత్రం యొక్క స్కాన్ చేసిన కాపీ (ముందు మరియు వెనుక), పాన్ (స్వీయ-ధృవీకరించిన పాన్ కార్డు యొక్క స్కాన్ చేసిన కాపీ), ఆధార్ (స్వీయ-ధృవీకరించిన ఆధార్ కార్డు యొక్క స్కాన్ చేసిన కాపీ) వంటి అవసరమైన వివరాలను **కంపెనీ / ఆర్‌టిఎ ఇమెయిల్ ఐడికి** ఇమెయిల్ ద్వారా అందించవలెను.
తదుపరి, తమ ఇమెయిల్ చిరునామాను నమోదు చేసుకోని వాటాదారు(ల)కు, వార్షిక నివేదిక యొక్క పూర్తి వివరాలు అందుబాటులో ఉన్న వెబ్-లింక్‌ను, దాని ఖచ్చితమైన మార్గంతో సహా అందిస్తూ ఒక లేఖ పంపబడుతుంది.
తమ ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసుకోని / అప్‌డేట్ చేయని వాటాదారులు, డిపాజిటరీ పార్టిసిపెంట్లతో వాటిని నమోదు చేసుకోవాలని / అప్‌డేట్ చేసుకోవాలని అభ్యర్థించడమైనది.
వాటాదారులు VC / OAVM సౌకర్యం ద్వారా మాత్రమే AGM లో హాజరు కాగలరు మరియు పాల్గొనగలరు. AGM లో చేరడానికి సూచనలు మరియు ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి మరియు AGM లో ఓటు వేయడానికి సంబంధించిన వివరణాత్మక విధానం AGM నోటీసులో అందించబడతాయి. కంపెనీ AGM నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై తమ ఓటు వేయడానికి, సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ ('CDSL') ప్లాట్‌ఫామ్ ద్వారా తన వాటాదారులందరికీ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని అందిస్తోంది.
**ఓటింగ్ సమాచారం:**
AGM సమావేశాన్ని ఏర్పాటు చేసే నోటీసులో పేర్కొన్న అంశాలపై సభ్యులు CDSL యొక్క ఇ-ఓటింగ్ వ్యవస్థ ద్వారా రిమోట్‌గా తమ ఓట్లను వేయడానికి అవకాశం ఉంటుంది.
రిమోట్ ఇ-ఓటింగ్ వివరాలు:

| | |
|---|---|
| రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభ తేదీ మరియు సమయం | మంగళవారం, 18 ఆగస్టు, 2026 ఉ. 9:00 గంటలకు (IST) |
| రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు తేదీ మరియు సమయం | గురువారం, 20 ఆగస్టు, 2026 సా. 5:00 గంటలకు (IST) |

బోర్డు తరపున మరియు కొరకు
ఆక్సిజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ తరపున
సం/- చంద్ర మౌళీశ్వర్ రెడ్డి గంగవరం
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
(DIN: 00046845)
తేదీ : 24.07.2026
ప్రదేశం: హైదరాబాద్

## అటవీ సంపద పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వనపర్తి డిఎఫ్ఓ రేవంత్ చంద్ర**



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (నినాదం):** అటవీ సంపద పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వనపర్తి జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారిగా ఉన్న రేవంత్ చంద్ర వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు జిల్లా అటవీ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నియంత్రణ, అటవీ నేరాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అటవీ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మొక్కల సంరక్షణ, హరితహారం, కంపా పనులు, నర్సరీల నిర్వహణ ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శాఖ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని, పనులను నాణ్యతతో చేపట్టాలని కోరారు. ప్రతి అధికారి, ఉద్యోగి సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు.

## రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలి

### ఏకరూప దుస్తులను సకాలంలో కుట్టించి విద్యార్థులకు అందజేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్




**గద్వాల బ్యూరో జూలై 24(నినాదం)** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఏకరూప దుస్తులు, వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఆగస్టు 15లోగా అందించేలా నిబంధనల ప్రకారం కుట్టించాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఆయా జిల్లాల్లో పంటల సాగుపై సమీక్షించారు. ఈనెల 27వ తేదీ నుంచి 29 వరకు మండలాల వారీగా రైతులు సద్వినియోగం చేసుకునేలా విత్తన మేళాలను నిర్వహించాలని ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో యూనిఫామ్స్ కుట్టిస్తున్నందున అవసరమైన సామాగ్రిని వారికి అందజేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టిచ్చింగ్ ఉండాలని ఆదేశించారు. ఆయా మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, వారికి కావాల్సిన ఏకరూప దుస్తుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు పెరిగేలా రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా శాఖలలోని వివిధ అంశాలకు సంబంధించి మండల, గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్లను రూపొందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, డిపిఓ శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఏఓ వీరప్ప, సిపిఓ పాపయ్య, డిడబ్ల్యుఓ సునంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు ఇచ్చారు.. మోకా చూపటం మరిచారు

### సిపిఎం తాడూరు మండల కార్యదర్శి అంతటి కాశన్న



**నాగర్ కర్నూల్ జులై 24 (నినాదం) :** తాడూరు మండలం బాలాన్ పల్లి గ్రామంలో పట్టాలు ఇచ్చిన నిరుపేద కుటుంబాలకు మోకా చూపాలని శుక్రవా రం బాలాన్ పల్లి గ్రామంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం తాడూరు మండల కార్యదర్శి అంతటి కాశన్న మాట్లాడుతూ. పట్టాలు ఇచ్చారు కానీ మోకా చూపటం మరిచారని వెంటనే సర్టిఫికెట్లు పొందిన నిరుపేదలందరికీ మోకా చూపించాలని డిమాండ్ చేశారు. 1999 లో గత ప్రభుత్వం ఇల్లు లేని 54 మంది నిరుపేదలకు 116 గజాల తో ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టా సర్టిఫికెట్లు జారీ చేసిందని ప్రభుత్వం ఇచ్చిన ఈ సర్టిఫికెట్లలో హద్దులు లేని కారణంతో నేటి వరకు పట్టదారులు ఇంటి నిర్మాణాలకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాడూరు మండల తహసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకొని సర్వే యర్ తో ప్లాట్లకు హద్దులు గుర్తించాలని కోరారు. పేదలకు ఇచ్చిన ప్లాట్ లలో ప్రభుత్వశీ ఇతర నిర్మా ణాలు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తుందని ప్రభుత్వానికి ఇది సమంజసంకాదని అన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన ప్లాట్ లలో హద్దులు చూపాలని ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం నిరుపేదల పట్ల జాలితో ఉండాలని వారికి వెంటనే మోకా చూపించి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవ డానికి సహకరించా లన్నారు. పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో పేదల ఇండ్ల నిర్మాణం కాకుండా ఇతర నిర్మాణాలు చేపడితే ఇండ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి పి ఐ కార్యదర్శి బసవయ్య సిపిఐ వెంకటస్వామి గోపాల్ ఎండి హు స్సేన్ లక్ష్మయ్య రాములమ్మ సుల్తాన్ ముసలయ్య పాల్గొన్నారు.

## ఫీజుల బకాయి బీజేపీ లడాయి పోస్టర్ విడుదల



**నారాయణపేట ప్రతినిధి, జులై 24, (నినాదం):** బి జె వైయం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు బి జె వైయం ఆధ్వర్యంలో పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ పై ఉద్యమ కార్యాచరణను చేపట్టింది. ఈ సందర్భంగా ఫీజుల బకాయి బీజేపీ లడాయి అనే పోస్టర్ ను రిలీస్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే వాటిని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసే వరకు రోజు వారిగా ఉద్యమిస్తామని తెలిపారు. ఉద్యమంలో భాగంగా రేపటినుండి కళాశాలకు వెళ్లి ప్రతి విద్యార్థిని కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తామని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్రీనివాస్, మోహన్, కోశాధికారి మణి, చేతన్, డి. మణి , నవీన్ చామకూర, గోకుల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్

### జూలై 25 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ



**గద్వాల బ్యూరో జులై 24( నినాదం )** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్ నిర్వహిస్తున్నట్లు టీజీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ , ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 25, 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభం కానుందని వివరించారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాల యం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.00 లక్షల లోపు ఉండాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. ఈ ఫౌండేషన్ కోర్స్‌లో గ్రూప్–I, గ్రూప్–II, గ్రూప్–III, గ్రూప్–IV, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియా మక పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించను న్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకు లచే బోధనతో పాటు వీక్లీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించబడతాయని, లైబ్రరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కోచింగ్ కాలంలో అభ్యర్థులకు ప్రతి నెల రూ. 1,000 చొప్పున బుక్ ఫండ్, రవాణా భత్యంగా స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలి పారు. మొత్తం సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థు లకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థు లకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశ మ ని, అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువు లోగా ఆన్‌లై న్‌లో దరఖాస్తు చేసుకోవా లని కోరారు. 08546-293022, 998543 4941 ఫోన్ నంబర్లు కు సంప్రదించాలన్నారు.

## ఐదేళ్లు నిండిన ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### ప్రీ ప్రైమరీ నుంచే నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందించాలి.. తూడుకుర్తి పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను పరిశీలించిన కలెక్టర్ ఎమ్మెల్సీ





**నాగర్ కర్నూల్ జూలై 24 (నినాదం) :** ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్యే బలమైన పునాది అని, ఈ దశలోనే పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి సందర్శించారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతులను పరిశీలించి, తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన విద్యా వాతావరణం, చిన్నారులకు అందుబాటులో ఉంచిన ఆట వస్తువులు, బోధనా సామగ్రి, విద్యార్థుల హాజరు, బోధనా విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల నమోదు, తరగతుల నిర్వహణ, తల్లిదండ్రులతో సమన్వయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లా డుతూ.... గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రీ ప్రైమరీ విద్య ద్వారానే చిన్నారుల్లో భాషా నైపుణ్యాలు, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ పాఠశా లల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్య మంలో నిర్వహిస్తూ, పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, కార్యకలాపాల ఆధారితబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ......, ప్రైవేటు పాఠశాలలపై ఉన్న ఆకర్షణ కారణంగా అనేక మంది తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేసి మరీ చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని, ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రీ ప్రైమరీ తరగతులను ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభించే నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు స్థాయిలో నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై పూర్తి విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేర్పించాలని ఎమ్మెల్సీ కోరారు. ముఖ్యంగా తూడుకుర్తి గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి గ్రామస్థుడికి వివరించాలని అన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఏటీసీ (ఐటిఐ) కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్ర నిర్మాణానికి అనువైన స్థలం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థలానికి సంబంధించిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, విద్యాశాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలలో సివిల్ పనులు పూర్తి చేయండి


### ప్రిన్సిపాల్‌ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 24 (నినాదం) :** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మంజూరైన నిధులతో త్వరగా సివిల్ పనులను, ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేసి బిల్లులు సబ్మిట్ చేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్ ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ ల సమావేశం ఇంటర్ విద్యా కార్యాలయంలో జరిగింది. జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ కళాశాలలో ఇతర మరమ్మతులు, ఎలక్ట్రికల్ మరమ్మతులు, అవసరమైన సామాగ్రి కొనుగోలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులు కూర్చునే ఫర్నిచర్ ను మరమ్మతులు చేయించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు ప్రిన్సిపాల్ లకు లెక్చరర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు అధ్యాపకులకు కేటాయించిన తేదీలలో హాజరయ్యే విధంగా ప్రిన్సిపల్ లు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆదేశించారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో మరిన్ని అడ్మిషన్లను పెంచేందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ లు, అధ్యాపకులు సమన్వయంతో ప్రతి గ్రామంలో ఇంకా 10వ తరగతి చదివి కళాశాలలో చేరని విద్యార్థులను గుర్తించి వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ఆదేశించారు. ఇదివరకే అడ్మిషన్లు అయిన విద్యార్థుల యు డైసు, ఆధార్ అప్డేట్లు వెంట వెంటనే చేయించాలని ప్రిన్సిపల్ లను జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశిం చారు. ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు ఇప్పటినుండి ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేయడంతో పాటు విద్యార్థిని విద్యార్థులలో క్రమశిక్షణను పెంపొందించాలని, సామాజిక స్పృహను పెంపొందించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు స్లిప్ టెస్టులతో పాటు నెలవారి పరీక్షలను నిర్వహించి వారి మార్కులను నమోదు చేయాలని, ఫలితాలను విద్యార్థులకు తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు విద్యార్థులను గ్రేడుల వారిగా విభజించి ప్రత్యేక శిక్షణను ఇచ్చే విధంగా ఇప్పటినుండి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. అధ్యాపకుల కొరత ఉన్న కళాశాలల్లో వెంటనే అతిథి అధ్యాపకులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. అలాగే బోధన బోధనేతర సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## డిఏవి పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి బట్టి





**మణుగూరు జూలై 24 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చిక్కుడు గుంట వద్ద ఉన్న భద్రాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంటును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ లో పనితీరు విద్యుత్ ఉత్పత్తి, ఉత్పత్తిలో వచ్చే లోపాలు ఇబ్బందులను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. బి టి పి ఎస్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన డి ఏ వి పబ్లిక్ స్కూల్ ను ఆయన లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యతోపాటు నాణ్యమైన విద్యను అందించే విధంగా విద్యాసంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు పాఠశాల భవనం తరగతి గదులను ప్రయోగశాలను గ్రంథాలయాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం లక్ష్యాల గురించి తెలుసుకుని అభినందించారు. పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఏర్పాట్లను ప్రశంసిస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లంవెంకటరావు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జెన్కో సిఎం అండి హరీష్, నవీన్ మెటల్, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రభుత్వ అధికారులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## రఘునాథపాలెంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

### మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేసిన టిఆర్ఎస్ నాయకులు



**ఖమ్మం, జులై 24(నినాదం ):** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ ఉద్యమ నిలయం, యువతకు మార్గదర్శి, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఖమ్మం నియోజకవర్గంలోని పరిధిలోని రఘునాథపాలెం మండలం మదర్ తెరిసా మానసిక వికలాంగం కేంద్రంలో అత్యంత వైభవంగా, పండగ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అజ్మీర వీరు నాయక్ నాయకత్వంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు ఈ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అజ్మీర్ వీరు నాయక్ ఉన్నాయి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చడంలో, ఐటీ మరియు పారిశ్రామిక రంగాలలో రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టడంలో కేటీఆర్ పాత్ర చిరస్మరణీయం. స్వయం సమృద్ధి కలిగిన నాయకుడిగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ అసామాన్యం. తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు నిరంతరం ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేటీఆర్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి, సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ప్రజలకు మరింత కాలం సేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పిన్ని కోటేశ్వరరావు, హరి ప్రసాద్, తేజావత్ శంకర్, యాస రామారావు, ప్రదీపు, వెంకటేశ్వర్లు, తార, ప్రసాదు, పెంట్యా, లక్ష్మణ్, మెంటం రామారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అటవీ శాఖ అధికారిగా రేవంత్ చంద్ర



**గద్వాల బ్యూరో జూలై 24 (నినాదం):** నాగర్ కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రకు వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో శుక్రవారం గద్వాలలోని అటవీ శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది డిఎఫ్ఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు జిల్లాల్లో అటవీ సంరక్షణ, వనమహోత్సవం కార్యక్రమాల అమలు, మొక్కల పెంపకం, సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ తదితర కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ అదనపు బాధ్యతలతో అటవీ శాఖ పనులు మరింత సమన్వయంతో, సమర్థవంతంగా నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు.

### వాతావరణ మార్పులపై రైతులకు

## అవగాహన కల్పించిన ఎంపీడీఓ



**గద్వాలప్రతినిధిజూలై 24 (నినాదం)** జోగులాంబ గద్వాల జిల్లా సింధనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వ హించిన గ్రామసభలో ఎంపీ డీఓ భాస్కర్ పాల్గొని రైతులకు వాతా వరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వం–ర్షపాతం, పంటల సాగుపై కలిగే మార్పులను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు, బోర్ రీచార్జ్ పనుల ప్రాధాన్యతను వివరించారు. వి బి జి – ఆర్ ఎ ఎమ్ జి పథకాల ద్వారా చేపట్టే కార్యక్రమాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ పథకాల అమలులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ )లు , జీపీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.

### భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో

## బోనాల ఊరేగింపు



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 24 (నినాదం) :** భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ పాల్గొని బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు. శ్రీ భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ భూలక్ష్మీ మాత అమ్మవారికి బోనాల సమర్పణ మహోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి, మంగళ వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల శివసత్తుల పూనకాలు, గోవింద నామస్మరణలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. వీరితో పాటు నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, స్థానిక కార్పొరేటర్ స్రవంతి రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, కమిటీ సభ్యులు తోట గోపాల్, మిద్దె రవి, ఆకుల శ్రీశైలం పాల్గొన్నారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ మహోత్సవంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


### పండ్లు పంపిణీ చేసిన గోలి శ్రీనివాసరెడ్డి



**కల్వకుర్తి జులై 24 (నినాదం)** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ముఖ్య అతిథిగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కేక్ కటింగ్ చేయడం జరిగింది. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ,మాజీ మున్సిపల్ చైర్మన్ లు శ్రీశైలం, ఎడ్మ సత్యం, కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్ ,వార్డ్ సభ్యులు కిషోర్, నరేష్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, రమేష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


### గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

అందజేసిన సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి జులై 24 (నినాదం):** వెల్దండ మండల కేంద్రంలో నిర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి శానిటేషన్ కిట్లు , దుస్తువుల పంపిణీ చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఈ కార్యక్రమంలో, ఇంచార్జ్ ఎంపీవో గిరి గౌడ్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు పాలాది మల్లీశ్వరి రంగ నాథం, గుద్దటి కిష్టల్, పసునోజు వాణి పురు షోత్తం, గోసుల కొండల్, ముదికొండ కవిత రమేష్, మసిగుండ్ల వెంకటేష్, మరిపల్లి మంజుల శ్రీను, జంగిలి సునీత ఆనంద్, పిల్లి దేవేందర్, శిరుశనగండ్ల శేఖర్, గోపిరెడ్డి రఘు, రేవల్లి శోభ రాజు, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

### డీసీసీ అధ్యక్షులును కలిసిన టీపీసీసీ వైస్ ఛైర్మన్



**తల్లాడ, జూలై 24 (నినాదం ):** కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ ని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. శుక్రవారం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకం అయిన సందర్భంగా వెంకటేశ్వర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డిసిసి అధ్యక్షులకు వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపా అప్పయ్య, వైరా మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కాపా సుధాకర్ ఉన్నారు.

# ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యతనిస్తోంది

**సర్వే, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**సమీక్ష సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





**గద్వాల బ్యూరో జూలై 24( నినాదం) :** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంను పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ దిశగా అధికారులు జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ప్రైమరీ డిక్లరేషన్ పూర్తయి అవార్డు స్థాయిలో ఉన్న భూముల వివరాలను అడిగారు. అనంతరం వివిధ మండలాల వారీగా ఆయా గ్రామాల పరిధిలో చేయాల్సిన భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన జాయింట్ ఇన్స్పెక్షన్ పూర్తి చేయాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు కావలసిన భూసేకరణకు సంబంధించి తనగల గ్రామస్తులతో మరోసారి గ్రామ సభ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సేకరణ విషయంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి అధికారులతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి నిబంధనల ప్రకారం ముందుకెళ్లాల న్నారు. జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టుల చుట్టుపక్కల ఉన్న ఇరిగేషన్ రహదారులను అభివృద్ధి చేసేందుకు ఆర్ అండ్ బి శాఖ ముందుకొచ్చిందని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే ప్రభు త్వానికి నివేదిస్తానన్నారు. భూ సేకరణపై తరచు సమీక్ష సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తామని, అధికారులు ఎప్పటికప్పుడు పురోగతి సాధిస్తూ కావాల్సిన భూసేకరణ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా చేరుకోవాలని సూచించారు. ఈ సమా వేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఆయా మండలాల తహసిల్దా ర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జ్వరం మూడు రోజులకు మించి ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి**

**ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి సీజనల్ వ్యాధులను అరికట్టాలి**



**గద్వాల బ్యూరోజులై 24(నినాదం ) :** వర్షాకాలంలో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు,టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సంధ్యకిరణ్మయి సూచించారు. శుక్రవారం మల్దకల్ మండల కేంద్రంలోని నిర్వహించిన "పొడి దినం" అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీ నుంచి ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక జ్వర సర్వే నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జ్వర బాధితులను గుర్తించి వివరాలు సేకరిస్తున్నారని, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రిలో అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జ్వరం మూడు రోజులకంటే ఎక్కువ కొనసాగితే డెంగీ పరీక్షలు, అనంతరం అవసరమైతే మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, నీటి నిల్వ పాత్రలకు మూతలు పెట్టడం, దోమతెరలు వినియోగించడం, పూర్తి శరీరాన్ని కప్పే దుస్తులు ధరించడం, కాచి చల్లార్చిన నీరు తాగడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వర్షంలో తడిసిన తర్వాత జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ముఖ్యంగా పిల్లల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆయాసం, అధిక జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. "చికిత్స కంటే నివారణే మేలు" అనే సందేశంతో ప్రతి మంగళవారం, శుక్రవారం "పొడి దినం" పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమలు, ఈగలు పెరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ప్రసూన రాణి, డీపీఎచ్ఎన్ఓ వరలక్ష్మి, స్థానిక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





సంఘ చైర్మన్ భాషని ప్రకాష్ ను ప్రమాణ స్వీకారం చేసి అధికారి



బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన స్థాపనకు వస్తున్న ఎమ్మెల్యే

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో సమన్వయ లోపం

**సమన్వయ పరచడంలో ఎమ్మెల్యే ప్రయత్నం విఫలం**

**విగ్రహ ప్రతిష్టాపన శంకుస్థాపనకు ఆలస్యమైన ఎమ్మెల్యే తీరుపై చేనేత కార్మికులు అసంతృప్తి,**

**హన్మకొండ,జూలై24, (నినాదం):** ఇటీవల జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో ఒకే పార్టీకి చెందిన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఏర్పాటు చేసుకున్న ప్యానల్ల మధ్య పోటా పోటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో ఒక గ్రూపు కు చెందిన ప్యానల్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో అలక చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకున్ని బుజ్జగించడానికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రయత్నం ఫలించ లేదు. వివరాల్లోకి వెళితే హన్మకొండ జిల్లా శాయంపేట మండలకేంద్రశీలో ఈ నెల 10 వ తేదీన జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికల్లో చోటు చేసుకున్న విభేదాలు ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు కు తలనొప్పిగా మారింది. సంఘం ఎన్నికల్లో ఒకే పార్టీకి చెందిన నాయకులు రెండు వర్గాలుగా విడిపోవడంతో మాజీ ఎంపీపీ బాసాని చంద్ర ప్రకాష్ మద్దత్తు తెలిపిన వర్గం సంఘం ఎన్నికల్లో సరైన మెజార్టీ రాకపోవడంతో చైర్మన్ పదవిని కోల్పోయింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన భాసని ప్రకాష్ తన నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావును ఆహ్వానిశీచారు. ఆహ్వానం మేరకు శాయంపేట గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే నిర్మాణం చేసిన పలు అభివృధి పనులను ప్రారంభించారు. అక్కడి నుండి కాలినడకన శంకుస్థాపన స్థలానికి ఎమ్మెల్యే వస్తున్న క్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ బాసాని చంద్ర ప్రకాష్ ఎమ్మెల్యే కు ఎదురు పడడంతో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన శంకుస్థాపనకు రావలసిందిగా కోరాడు. దీంతో అక్కడికి రాలేనని ఆలస్యమైతే తనే అపానని తప్పుడు సంకేతాలు సృష్టిస్తారని తెలుపుతూ ఎమ్మెల్యే పిలుపును చంద్ర ప్రకాష్ నిరాకరించాడు. అయినప్పటికీ ఎమ్మెల్యే అక్కడే ఉన్న ఒక ఇంట్లో కి చంద్ర ప్రకాష్ తో వెళ్ళి బుజ్జగించే ప్రయత్నం చేసాడు. కానీ ఎమ్మెల్యే ఎశీత ప్రయత్నం చేసిన చంద్రప్రకాష్ అక్కడికి రానని అవసరమైతే తమ ఇంటికైనా, క్యాంపు ఆఫీస్ కైనా వస్తానని అక్కడికి మాత్రం రాలేనని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే ఏమిచేయలేని పరిస్థితిలో వెనుదిరిగి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన శంకుస్థాపనకు వెళ్లారు. అప్పటికే రెండు గంటల నుంచి ఎమ్మెల్యే కోసం ఎదిరి చూస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు రోడ్లపై వేచి చూస్తూ ఎమ్మెల్యే ఆలయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ లో రెండు వర్గాలు వున్నా రెండు కండ్లు నావే అని భావించిన ఎమ్మెల్యేకు పార్టీలో నాయకులను సమన్వయ పరిచే ప్రయత్నం పలించలేదు.



ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళలు

**చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే గండ్ర**

శాయంపేట మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శాయంపేట గ్రామంలో పద్మశాలి కుల బంధవుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు చేశారు. అనంతరం చేనేత సహకార సంఘంలో నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ చేనేత సహకార సంఘంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తన్నాని హామీ ఇచ్చారు. కార్మికులకు చేతినిండా పని కల్పించే విధంగా అప్కో అధికారులు, అవసరమైతే మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ఆదుకుంటానని తెలిపారు. అర్హులైన నిరుపేద చేనేత కార్మికులకు ఇశీదిరమ్మ ఇండ్లు మంజూరి చేయిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బాసాని ప్రకాష్, ఉపాధ్యక్షుడు దిడ్డి రమేష్, బాసనీ రవి శాంత, డైరెక్టర్లు చేనేత కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇండియన్ సిల్క్ గ్యాలరీ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



**హైదరాబాద్ బ్యూరో, జులై 24, (నినాదం) :** మన చేనేత ఉత్పత్తులను ఆదరించాలని, చేనేత రంగంలో భారతీయ సాంస్కృతిక కళావైభవం గొప్పదని, చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు వారి కళా ఉత్పత్తులను నేరుగా వినియోగదారుల కు చేరాలనే సదుద్దేశంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ను నిర్వహించడం అభినంద నీయమని సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ జి. సృజన అన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ సైబర్ గార్డెన్స్ లో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. వినియోగదారుల కోరిక మేరకు...కొనసాగింపుగా ఈ సిల్క్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటుచేశామని, బోనాలు, శుభకార్యాలకు, పండుగలను అనువుగా ఇక్కడ వస్త్రాలు కొలువుదీరాయని అన్నారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను అభినందించారు. దేశంలో ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారు 80స్టాల్స్ లో ప్రదర్శిస్తున్నారని, ప్రత్యేకంగా గద్వాల్, వెంకటగిరి, ఇక్కత్, పటోల్, బెనారస్, కోలకతా, చెందేరి, మదనపల్లి, పోచంపల్లితో పాటు పలు విభిన్నరకాల చీరలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈనెల 26వరకూ మూడు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ వినియోదరులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వినయ్ కుమార్, శ్రీనివాసరావు తెలిపారు.

# ఆర్‌బిఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**నిజామాబాద్ ప్రతినిధి,జులై 24 (నినాదం) :** కోటగల్లి శంకర్ భవన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ ఆరోగ్య సమస్యలు గుర్తించడానికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని డా. భాస్కర్ తెలిపారు. ముఖ్యంగా కంటిచూపు, చర్మ చెవి ముక్కు గొంతు సమస్యలు రక్తహీనత సమస్యలను గుర్తించి ఆ పిల్లలకు ఉచితంగా చికిత్స అందించడమే ఆర్ బి ఎస్ కే ప్రధాన ఉద్దేశం అని అన్నారు జిల్లా స్థాయిలో ట్రీట్మెంట్ కాకపోతే హైదరాబాద్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్యం అందిస్తామని దీంతోపాటు విద్యార్థులకు హెల్త్ కార్డులు అందించడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నామని డాక్టర్ భాస్కర్ అన్నారు. గతవారం జిహెచ్ఎస్ శంకర్ భవన్ హైస్కూల్లో వైద్య పరీక్షలు నిర్వహించగా దాదాపు 40 మంది విద్యార్థులు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించామని ఒక సర్జరీ కేసును గుర్తించి రిఫర్ చేశామని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్ ఆర్ బి ఎస్ కే సిబ్బంది ఉపాధ్యాయులు దయానంద్ నందిని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కేటీఆర్ జన్మదినం

**సుల్తానాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ఘన సంబరాలు..**



**సుల్తానాబాద్, జూలై 24 (నినాదం):** మాజీ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామా రావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్య మ కారుడు, మాజీ ఎంపీటీసీ సురశ్యామ్ ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుతూ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తె లిపారు. తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ అందించి న సేవలను ఈసందర్భంగా నాయకులుకొనియాడారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి గుణపతి, కొదు రుపాక సర్పంచ్ ఉత్తమ కుమారి, తాళ్లపల్లి మ నోజ్ గౌడ్, క్యాదాసి చంద్రమౌళి, మల్లికార్జున్, మో హన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మొలుగూరి అంజయ్య, లంక దాసరి రవీందర్, తిప్పారపు దయాకర్, కూ కట్ల గోపి, ఎండీ సాజిద్, కుమార్ బాబు, శీలం శంకర్, పోసాని శ్రీనివాస్, వేయికళ్ల నరేందర్, కంపల్లి రాజు, కనకం శంకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్లోబరీనా..దిద్దు కోలేని తప్పు..!

**32 మంది విద్యార్థుల ఆత్మహత్య**

**ముఖ్యమంత్రి వాఖ్యలతో మళ్లీ చర్చలోకి**

**గ్లోబరీనా గుట్టు విప్పిన ముగ్గురు టీనేజర్లు**


**జగిత్యాల ప్రతినిధి జూలై 24 (నినాదం ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్లోబరినా సంస్థ పై చేసిన వ్యాఖ్యలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. విద్యార్థి లోకం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ వైపు ప్రశ్నార్థకంగా చూస్తుంది. గ్లోబరినా నిజంగా కేటీఆర్ బినామీ సంస్థ ఏనా..? ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఆలోచనలో పడేసిన ప్రశ్న. రేవంత్ రెడ్డి చెప్పింది నిజమే అయితే బి ఆర్ ఎస్ రాజకీయ సమాధి అయినట్టే అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్లోబరిన సంస్థ యజమాని వి వి.ఎస్ రాజుకు కేటీఆర్ కున్న అనుబంధం ఏంటి.. ఇంటర్నెట్లో జల్లెడ పడుతున్న విద్యార్థులు.

**గ్లోబరీనా.... కరోనా కంటే ప్రమాదం..!**

కరోనా మనిషి శ్వాసకోసాల మీద దెబ్బ కొట్టి చంపుతుంది.. గ్లోబరీనా దేశ భవిష్యత్తుపై దెబ్బ కొట్టి యువతను ఆత్మహత్యల వైపు నెడుతుంది. 2019లో తెలంగాణ ఇంటర్ విద్యార్థుల రక్తాన్ని తాగిన రాబందు గ్లోబరీనా సంస్థ.. కో ఎంప్ట్ గా పేరు మార్చుకొని మరో సారి సీబీఎస్సి లో చొరబడింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడింది. తెలంగాణ ఇంటర్ పరీక్ష రాసిన 3 లక్షల 80వేల మంది విద్యార్థులను అన్యాయంగా ఫెయిల్ చేసింది. ఆన్సర్ షీట్లు దిద్దడం రాని ఈ సన్నాసి సంస్థకు ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తును అప్పగించారు. 32 మంది విద్యార్థుల ఆత్మహత్యకు కారణమైంది. బ్లాక్ లిస్టులో పెట్టారు క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టులు కూడా చేశారు. కోర్టు చుట్టు తిరగాల్సిన గ్లోబరీనా తిరిగి సీబీఎస్సీ టెండర్ లోకి ఎలా దూరింది..?

**గ్లోబరీనా అలియాస్ కోయంట్ గుట్టు రట్టు.**

దేశం లో అతి పెద్ద విద్య మండలి సి బి ఎస్ సి గుట్టు రట్టు చేసింది ముగ్గురు టీనేజ్ విద్యార్థులు.. రాత్రి పగలు ఒకటి చేసి చదివి




పరీక్ష రాస్తే భిన్నమైన ఫలితాలు రావడంతో కడుపు మండి ఇంటర్నెట్ ను జల్లెడ పట్టారు. సీబీఎస్సీ టెండర్ ప్రక్రియ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ స్క్రీన్ మార్కింగ్ లో పెద్ద లోపాలు ఉన్నాయని బయటపెట్టారు. ఈ విషయం సీబీఎస్ఈ కూడా ఒప్పుకోవడం గమనార్హం. 18 ఏళ్లు కూడా నిండని ముగ్గురు విద్యార్థులు సీబీఎస్సీ పరీక్ష నిర్వహణలో లోపాల గురించి అడిగిన ప్రశ్నలకు ఢిల్లీ పీఠం షేక్ అయింది. ఈ ఏడాది సిబిఎస్ లో తీసుకొచ్చిన కొత్త డిజిటల్ ప్రాసెస్ లో అనేక తప్పిదాలు వెలుగు చూశాయి. ముఖ్యంగా ఆన్లైన్ స్క్రీన్ మార్కింగ్. దీని ఉద్దేశం డిజిటలైజేషన్ ట్రాన్స్పరెన్సి ఫాస్ట్ ప్రాసెసింగ్ ఈ విధానంలో ఒక్క చిన్న తప్పు జరిగిన విద్యార్థి భవిష్యత్తు మారిపోతుంది.. ఆన్సర్ సీటును స్కానింగ్ చేసి విద్యార్థికి టాగింగ్ చేసి డేటా బేస్ కి అటాచ్ చేసి మ్యాచింగ్ చేసి అప్లోడ్ చేస్తారు. ఈ వెరిఫికేషన్ లో ఒక చిన్న మిస్ మ్యాచ్ అయినా ఒకరి ఆన్సర్ షీట్ ఇంకొకరికి వెళ్లే ప్రమాదం ఉంది. సీబీఎస్ఈ పరీక్ష నిర్వహణలో కోయంట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడింది. దీంతో దేశంలో ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించే సిస్టం మీద విద్యార్థులకు అనేక సందేహాలు కలుగుతున్నాయి. ఇప్పుడు విద్యార్థులు అడుగుతున్న ప్రశ్న ఒక్కటే... ఇంత కష్టపడి నిజం నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మార్కులు విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే దేశంలో ఖచ్చితత్వం ప్రభుత్వ బాధ్యత కదా అని ప్రశ్నిస్తుంది.

**టెండర్ ప్రక్రియ దారుణాలు..!**

సార్థకు సిద్ధాంతి అనే 12 ఏళ్ల విద్యార్థి బయట పెట్టిన వివరాల ప్రకారం.. ఈ విద్యార్థి సీబీఎస్ఈ పేపర్ లీక్ ఎలా జరిగింది రూట్ ఆఫ్ కాజ్ కోసం వెతికాడు. ఇంటర్నెట్ను జల్లెడ పట్టాడు. బ్యూరో క్రాట్స్ కూడా చదవడానికి భయపడే వందల పేజీల సీబీఎస్సీ టెండర్ డాక్యుమెంట్లను లైన్ బై లైన్ క్లాస్ బై క్లాస్ జల్లెడ పట్టాడు. ఒక్క టెండర్ ఏ కాదు మల్టిపుల్ టెండర్ లో వర్షంను తిరిగేసాడు అక్కడ ఈ టెండర్ అసలు రంగు బయటపడింది. గ్లోబరీన కు టెండర్ కట్టబెట్టడం కోసం రూల్స్ మార్చేశారు. టెండర్ ప్రక్రియలు అనేక కఠిన నిబంధనలు ఉంటే ఒక కంపెనీకి లాభం ఎలా చేకూరింది.? అనేదానిపై ఇంటర్నెట్లో అన్వేషణ చేశాడు. కోఎంట్ పేరుతో సీబీఎస్ఈ పరీక్ష నిర్వహించిన సంస్థ ఎక్కడిది అని సార్థకు చేసిన ఎక్ససైజ్ లో కోయం టు పాత పేరు గ్లోబరీనా అనీ తేలింది. కోయం టు ఎడ్యుటెక్ పాత పేరు గ్లోబరీనా టెక్నాలజీస్ అని సార్థకు బయట పెట్టాడు. టెండర్ అర్హతలు తారుమారు చేశారని సార్థక్ ఇన్వెస్టిగేషన్లో బయటపడ్డాయి. కాంట్రాక్టర్ పనితీరును ఎలా కొలుస్తారు... తప్పులు జరిగితే శిక్షలు ఎలా ఉంటాయి.. క్వాలిటీని ఎలా కంట్రోల్ చేస్తారు.. అనే అంశాలను పక్కన పెట్టేశారు. ప్రతి ప్రభుత్వ అటెండర్ కు స్కోరింగ్ సిస్టం ఉంటుంది. ఈ స్కోరింగ్ టెండర్ ఓడేది గెలిచేది డిసైడ్ చేస్తుంది. గతంలో పెద్దపెద్ద ప్రాజెక్టు చేసిన అనుభవాన్ని సక్సెస్ఫుల్ ఆపరేషన్ చేసిన ట్రాక్ రికార్డు ఉన్న సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ప్రాజెక్టు వాల్యూస్ సేల్స్ హ్యాండిల్స్ చేసిన పేజీల సంఖ్య టెండర్ గెలుపుకు ఇదే మెయిన్ క్రైస్ట్ ఏరియా.. ఇవన్నీ పక్కకు నెట్టి కోయంటూ అనే మాజీ గ్లోబరీనకు సీబీఎస్సీ టెండర్ కంటగట్టడంలో ఎవరి ప్రమేయం ఉంది లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆడుకున్న ఈ టెండర్ వెనుక ఉన్న బిగ్ బాస్ ఎవరు..? మొదట సీబీఎస్సీ టెండర్లు టిసిఎస్ లాంటి దిగ్గజాలు ఉన్న ఆ టెండర్ను రద్దు చేశారు..? రెండోసారి కొత్త టెండర్ తెచ్చి రూల్స్ మార్చి ఈ రక్త మరిగిన సంస్థకు రెడ్ కార్పెట్ పరిచారు. సార్థక సిద్ధాంతం ఫైండ్ అవుట్ చేసిన ఆధారాలు చూస్తే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. గ్లోబరీనా పాత రికార్డు క్రిమినల్ యాక్టివిటీస్తో ఉండడంతో పేరు మార్చుకొని కొత్త టెండర్లోకి ఎందుకు వచ్చారు.? టెండర్ నిబంధనల ప్రకారం బ్లాక్ లిస్టో ఉన్న కంపెనీలు పనికి రావని నిబంధనను మార్చి ప్రస్తుతం బ్లాక్లిస్టులో ఉన్నవి మాత్రమేనని ఎందుకు చేర్చారు.? ఎవరికి లబ్ధి చేర్చడం కోసం టెండర్ ప్రక్రియలో ఈ నిబంధనలను సులభతనం చేశారని ప్రశ్నలు తీవ్రతరం అవుతున్నాయి?. కోట్లాదిమంది విద్యార్థుల డేటా హ్యాండిల్ చేసే సాఫ్ట్ వేర్ కంపెనీ కి ఉండాల్సిన కామన్ మెచ్యూరిటీ లెవల్ను స్టాండర్డ్ను ఎందుకు తగ్గించారు.? రిటైర్డ్ అధికారులు కంపెనీలో చేరకూడదని నిబంధనను టూ ఇయర్స్ ఆఫ్ కూలింగ్ ను సంవత్సరానికి ఎందుకు కుదించారు.? సొంత డేటా సెంటర్ ఉండాలని నిబంధనను తీసివేసి థర్డ్ పార్టీకి ఇచ్చుకుని నిబంధనలను ఎందుకు చేర్చారు.? సోర్స్ కోడ్ పై నిబంధనలను పూర్తిగా ఎందుకు తుడిచి పెట్టారు. ఈ వివాదం పార్లమెంటుకు తాకింది. సార్థక సిద్ధాంతం చేసిన ఇన్వెస్టిగేషను రాహుల్ గాంధీ ప్రత్యక్షంగా అభినందించారు. ఇది జ్యూడిషియల్ ఎంక్వయిరీ లో మాత్రమే తేలుతుందని ప్రతిపక్ష నేత జయరాం రమేష్ డిమాండ్ చేశారు.

**తెలంగాణ గడ్డ అడుగుతోంది..?**

తెలంగాణ బిడ్డల భవిష్యత్తును బుగ్గిపాలు చేసిన నరహంతక సంస్థకు సీబీఎస్సి కాంట్రాక్ట్ కట్టబెట్టింది ఎవరు..? విద్యార్థుల శవాల మీద పైసలు ఏరుకున్న సంస్థకు మళ్లీ కాంట్రాక్టు వచ్చే విధంగా సహాయం చేసిన ప్రజాప్రతినిధులు ఎవరు..? క్రిమినల్ హిస్టరీ ఉన్న సంస్థకు దేశ భవిష్యత్తును ఎలా అప్పగిస్తారు. అని తెలంగాణ గడ్డ అడుగుతుంది.. సమాధానం చెప్పే ముఖం ఎవరికైనా ఉందా..?






# బొద్దింకలను తేలికగా తీసుకోరాదు!

సంపాదకీయం

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీ చూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదానిపై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు య పిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకటఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కవి షన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల వి ద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ వి డియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ వి డియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ వి డియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ వి డియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌వి డియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమ ర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ వి డియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పుడే దేశం బాగు పడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

# నీటి ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం

## జూలై 25...ప్రపంచ ముంపు నివారణ దినోత్సవం

**ప్రతి సంవత్సరం జూలై 25న నిర్వహించే ప్రపంచ ముంపు నివారణ దినోత్సవం (World Drowning Prevention Day) అనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆధ్వర్యంలో, ఐక్యరాజ్య సమితి 2021లో ప్రకటించిన అత్యంత కీలకమైన అంతర్జాతీయ దినోత్సవాలలో ఒకటి. నీటిలో మునిగి పోవడం వల్ల జరిగే అవాంచిత మరణాలను నివారించేందుకు, నీటి భద్రతపై అవగాహన కల్పించేందుకు, సంబంధిత చర్యలు చేపట్టేందుకు ఈ దినోత్సవం ఒక ప్రభావ వంతమైన వేదికగా నిలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది అనుకోకుండా నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు.**

ముఖ్యంగా చిన్న పిల్లలు, యువకులు, ఆర్థికంగా వెనుకబడ్డ సముదాయాలు ఈ ప్రమాదానికి ఎక్కువగా గురవుతున్నారు. ఈ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకొని, ఈ సమస్యపై ప్రభుత్వాలు, సంస్థలు, పౌరసమాజం కలిసి కలిసీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ప్రతి సంవత్సరం సగటున 2.36 లక్షల మంది మునిగి పోవడం వల్ల మరణిస్తున్నారు. వీరిలో సగానికి పైగా వయస్సు 30 సంవత్సరాలకు లోపు వారే. ఐదేళ్ల లోపు పిల్లల్లో రోడ్డు ప్రమాదాల తర్వాత మునిగి పోవడం రెండవ అత్యధిక మరణ కారణంగా గుర్తించ బడింది. ప్రపంచ వ్యాప్తంగా 80 శాతం మునిగిపోయే మృతుల్లో పురుషులే అధికం కావడం గమనార్హం. పాకిస్థాన్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయిలాండ్, నైజీరియా, టాంజానియా వంటి దేశాల్లో మునిగిపోయే మరణాల శాతం అత్యధికంగా ఉంది. ఉదాహరణకు, బంగ్లాదేశ్‌లో సంవత్సరానికి సుమారు 19,000 మంది చిన్న పిల్లలు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. పశ్చిమ ఆఫ్రికాలో 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు గల యువకులు మునిగిపోతున్న వారి 40 శాతాన్ని కలిగి ఉన్నారు.

భారత దేశంలో కూడా ఈ సమస్య తీవ్రమైనది. ముఖ్యంగా తూర్పు గంగా తీర ప్రాంతాలు, బ్రహ్మపుత్రా నదీ పరివాహక ప్రాంతాలు, కోస్తా ఆంధ్ర, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, అస్సాం వంటి రాష్ట్రాల్లో వర్షాకాలం ముంపులు, ప్రమాదకర నీటి ప్రవాహాలు కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2023లో మణిపూర్ లోని లౌక్టి రిజర్వాయర్ వద్ద పడవ మునిగి పాఠశాల పిల్లలతో పాటు 14 మంది మృత్యువాత పడ్డ సంఘటన, 2022లో మహారాష్ట్రలో వరద నీటిలో ముగ్గురు బాలురు గల్లంతైన ఘటనలు నీటి భద్రతపై ప్రజలలో సరైన అవగాహన లేకపోవడం, నియంత్రణ చర్యల లోపాన్ని నిరూపించాయి. కొన్ని సందర్భాల్లో నీటిమీద ప్రయాణాల సమయంలో లైఫ్ జాకెట్లు లేకపోవడం, పడవల్లో అధిక జనాభా ఉండటం, చక్రాల లేని తచ్చాడే పడవల వినియోగం వంటి కారణాల వల్ల ప్రాణ హానులు సంభవిస్తున్నాయి.




ఈ సమస్యకు పరిష్కార మార్గాలు లేకపోలేదు. అయితే అవి ప్రజల చైతన్యంతో పాటు పాలనా యంత్రాంగం తగిన చర్యలు తీసుకున్నపుడే ఫలితాన్నిస్తాయి. మునిగి పోవడాన్ని నివారించేందుకు అనుసరించ వలసిన ప్రధాన కార్యాచరణలో పిల్లలు, యువత, గృహిణులు, వృద్ధులందరికీ ఈత శిక్షణ అందించడం మొదటి దశ. పాఠశాలలు, అంగన్‌వాడీలు, యువజన కేంద్రాల్లో ఈత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చు. రెండవది – ప్రతి నివాస ప్రాంతంలోని నీటి వనరులకు భద్రతా ఏర్పాట్లు చేయడం. చెరువులు, బావులు, బోర్లు, డ్రైన్లు వంటి వాటికి కంచెలు లేదా గ్రిల్లు ఏర్పాటు చేయడం, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రమాదంలో పడకుండా ఉండేలా చేయడం అత్యవసరం.

ఇక నీటి భద్రతకు సంబంధించి స్థానిక సంస్థలు, పంచాయతీలు, మునిసిపాలిటీలు నిర్ణీత ప్రమాణాలు అమలు చేయడం కీలకం. హైఅలర్ట్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, నిబంధనలు పాటించని వారు కోసం జరిమానాలు వంటి చర్యలు తీసుకోవాలి. నీటి పట్ల ప్రజల అభిమతాన్ని భద్రతగా మలచేందుకు మీడియా పాత్ర కీలకం. WHO సూచించిన విధంగా CPR (Cardiopulmonary Resuscitation) శిక్షణ ప్రతి పాఠశాలలో, కమ్యూనిటీ హాల్లలో, పోలీసు కేంద్రాల్లో అందించ గలిగితే, ప్రమాదంలో పడిన వారిని తక్షణం ప్రాణాలతో బయటపడే అవకాశాలు పెరుగుతాయి.

ప్రపంచ సహజ విపత్తుల నివారణ దినోత్సవం (International Day for Disaster Risk Reduction) ముంపు వంటి విపత్తులపై ముందస్తు చర్యల అవసరాన్ని గుర్తు చేస్తుంది. 2000 నుంచి 2020 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా ముంపుల వల్ల 1.65 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 2022లో పాకిస్థాన్‌లో వరదల కారణంగా 1,700 మంది మరణించగా, దాదాపు 3 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. 2023లో లిబియా దేశంలోని డెర్నా పట్టణంలో రెండు డ్యాములు తెగిపోవడంతో ఒక్కరోజే 10,000 మందికి పైగా మరణించారు. భారత దేశంలో ప్రతీ సంవత్సరం సగటున 3,500 మంది వరదల కారణంగా మరణిస్తున్నారు. ఇది మునిగి పోవడంపై మనం తీసుకోవలసిన చర్యలు ఎంతగానో ఆలస్యం అవుతున్నదని సూచిస్తుంది.

ఇందువల్ల నీటి ప్రమాదాలను నియంత్రించేందుకు ముంపులను, వరదలను, చెరువుల భద్రతను, మరియు మానవ అజాగ్రత్తను ఒకే అంశంగా చూసి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు NDMA, SDRF, స్థానిక విపత్తు నిర్వహణ సంస్థల సహకారంతో నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. UNICEF, Red Cross Society వంటి సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన వందలాది ఉదాహరణలు ప్రేరణ కలిగించేలా ఉన్నాయి. నేపాల్, వియత్నాం, ఫిలిప్పీన్స్, కెన్యా వంటి దేశాల్లో గ్రామస్థాయిలో ఈత శిక్షణ కేంద్రాలు, నదీ తీరాలలో హెచ్చరికల బోర్డులు, రక్షణ గట్ల నిర్మాణం వంటి చర్యలు విజయవంతంగా అమలవుతున్నాయి.

ప్రపంచ ముంపు నివారణ దినోత్సవం మనకు ఇచ్చే ముఖ్య సందేశం – ప్రతి నీటి వనరును అభివృద్ధికి ఉపయోగించాలే కానీ, అది ప్రాణాల నాశనానికి మారకూడదు. పిల్లల లోకాన్ని నీటి మునిగిన స్వప్నంగా మార్చకుండా, భద్రత అనే దివిటీతో వెలిగించాలి. ప్రజల అవగాహన, పాలకుల చొరవ, మౌలిక వసతుల అభివృద్ధి – ఇవన్నీ కలిస్తే నీటిలో మునిగే ప్రతి ప్రాణం రక్షణ పొందుతుంది. ఒక్క రోజు కోసం కాకుండా, ప్రతి రోజూ – నీటి వద్ద ఉన్నపుడల్లా, జీవితం మీద బాధ్యతతో మెలగాల్సిన అవసరం మనం గుర్తించాలి.

ప్రతి జీవితం విలువైనదే. నీటి చుట్టూ జాగ్రత్తల మాలికగా చైతన్యాన్ని అలంకరిద్దాం. ప్రపంచ ముంపు నివారణ దినోత్సవం – అది హెచ్చరిక మాత్రమే కాదు, మన ప్రాణ రక్షణకు మార్గదర్శక హస్తం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ఢిల్లీ ఆందోళన ముసుగులో అరచాక శక్తులు

## మీడియా సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,జూలై24(నినాదం):**

ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో మతతత్వ, కమనిస్ట్ శక్తులు అరాచకం సృష్టించాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అలాగే పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర కూడా చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు, జర్నలిస్టులపై దాడులతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని వివరించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరిరగ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ సమయంలో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరిగా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశమని అన్నారు. అందుకే ఈ విషయంలో అందరికంటే ప్రధాని మోదీ ఎక్కువగా బాధపడుతున్నారని చెప్పారు. పేపర్ లీక్ చేసిన నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీతో సహా 17 మందిని అరెస్ట్ చేశారని వివరించారు. విద్యార్థుల ఆందోళనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణలు చెప్పారని అన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించి.. వాటి ఫలితాలు కూడా ప్రకటించారని వివరించారు. పాకిస్తాన్ నుంచి సోషల్ వి డియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని అన్నారు. అందుకే ఆ దేశానికి చెందిన 480 సోషల్ వి డియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కోరుతున్నానని తెలిపారు. నీట్‌కు, ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు, ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి? నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి? నీట్‌కు సనాతన ధర్మానికి, రాముడికి, సీతమ్మకు సంబంధమేమిటి? అని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. విద్యార్థులెవరూ దేశ ద్రోహ నినాదాలు చేయబోరని పేర్కొన్నారు. డాక్టర్ కావాలనుకునే విద్యార్థులెవరూ రాళ్లు విసరరని పేర్కొన్నారు. నీట్ సమస్య పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తుపై ఇండియా కూటమికి ఆలోచనే లేదని చెప్పుకొచ్చారు. మోదీని దించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌ను ప్రధానిని చేయడమే వాళ్ల ఏకైక లక్ష్యమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పేపర్ లీకైతే నాటి సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కేరళలో ఎల్‌డీఎఫ్ పాలనలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగితే పినరయి విజయన్ ఎందుకు సీఎం పదవికి రాజీనామా చేయలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వం అంటేనే పేపర్ లీక్ ప్రభుత్వంగా మారిందని.. ఇది నిజం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎంసెట్ పేపర్, టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పేపర్, ఎసఎస్‌సీ తెలుగు, హిందీ పేపర్లు లీకయ్యాయన్నారు. పరీక్షలంటే పేపర్లు అమ్ముకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారంటూ బీఆరఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా? అని నిలదీశారు. తాను గ్రూప్ `1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో వి□రంతా చూశారని చెప్పారు. టెన్త్ పేపర్ లీక్ చేస్తే వాడిని పట్టుకోకుండా తనపై కేసు పెట్టి అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఇన్ని తప్పిదాలు చేసిన బీఆరఎస్ నాయకులు సిగ్గు లేకుండా పేపర్ లీక్‌పై ధర్నా చేయడమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చౌక్‌ను ఎత్తేసినోడు ఈరోజు ధర్నాకు కూర్చుంటే ఇందిరా పార్క్, ఎన్టీఆర్ స్టేడియం నవ్వుతున్నయంటూ వ్యంగ్యంగా అన్నారు. కనీసం పుట్టినరోజు కూడా నిజాలు చెప్పలేదు.. నోరు తెరిస్తే పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడంటూ బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ మండిపడ్డారు. విట్టర్ టిల్లు బినావి సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జ్ చేయించిన ఘటనలు మర్చిపోగలమా? అని పేర్కొన్నారు.

# సనాతన ధర్మంలో ప్రతి తిథీ ప్రత్యేకమైనదే

## నేడు తొలి ఏకాదశి తిథి.. యోగనిద్రలోకి శ్రీ మహావిష్ణువు

తిరుమల : భారతీయ సనాతన ధర్మంలో ప్రతి తిథికి ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, శాస్త్రీయ, తాత్విక ప్రాముఖ్యత ఉంది. వాటిలో ఆషాఢ శుక్ల ఏకాదశి. అనగా తొలి ఏకాదశి. దీనిని అత్యంత పవిత్రమైన పర్వదినంగా పరిగణించ బడుతుంది. ఈ రోజునే శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశిస్తారని, ఈరోజు నుంచే చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభమవుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని కోరుతూ, చాతుర్మాస్య సాధనకు సంకల్పించి, ఉపవాసం, జపం, ధ్యానం, దానం, సత్సంగం ద్వారా మన జీవితాన్ని పవిత్రం చేసుకోవడమే తొలి ఏకాదశి యొక్క నిజమైన సందేశం. ఈసారి తొలి ఏకాదశి 25వ తేదీ శనివారం జరుపుకుంటారు. సూర్యోదయం వేళ ఏ తిథి ఉంటే దానిని పరిగణలోకి తీసుకుంటారు. దీంతో తొలి ఏకాదశి శనివారంగా పరిగణిస్తారు. భవిష్య పురాణం ప్రకారం.. చాతుర్మాస్య వ్రతం తొలి ఏకాదశి నుంచే ప్రారంభమవుతుంది. ఈ నాలుగు నెలలు జపం, ధ్యానం, దానం, విష్ణు ఆరాధన, పురాణ పారాయణం చేస్తే అనేక రెట్లు పుణ్యఫలం లభిస్తుందని పేర్కొంది. తొలి ఏకాదశి మనకు కేవలం ఆహారాన్ని తగ్గించడం మాత్రమే కాదు, అహంకారం, కోపం, లోభం, అసూయ వంటి అంతరంగ దోషాలను తగ్గించుకోవాలని బోధిస్తుంది. భగవంతునికి దగ్గర కావడానికి ముందు మన మనస్సును పవిత్రం చేసుకోవాలనే సందేశాన్ని ఈ పర్వదినం అందిస్తుంది. తొలి ఏకాదశి అనేది ఒక పండుగ మాత్రమే కాదు.. అది భక్తి, నియమం, ఆత్మపరిశీలన, ధర్మాచరణ మరియు ప్రకృతితో సమన్వయ జీవన విధానానికి శ్రీకారం చుట్టే మహోన్నత దినం. పద్మ పురాణం, స్కంద పురాణం, భవిష్య పురాణం వంటి శా□స్త్రాలు దీనిని అత్యున్నత వ్రతాలలో ఒకటిగా కొనియాడాయి. రాజా మాంధాత ధర్మ పరుడు. ఒకసారి ఆయన రాజ్యంలో తీవ్రమైన అనావృష్టి ఏర్పడింది. ప్రజలు ఆకలి, దాహంతో బాధపడుతున్నారు. అప్పుడు మహర్షులు 'ఆషాఢ శుక్ల ఏకాదశి వ్రతాన్ని భక్తితో ఆచరించండి.' అని రాజుకు ఉపదేశించారు. దీంతో రాజు ప్రజలతో కలిసి ఉపవాసం చేసి శ్రీమహావిష్ణువును ప్రార్థించాడు. ఫలితంగా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. కరువు తొలగిపోయింది. రాజ్యంలో సుభిక్షం నెలకొంది. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించారు. దీనిద్వారా ఏకాదశి వ్రతం వ్యక్తిగత శ్రేయస్సుకే కాదు, సమాజ హితానికీ సంకేతమని పద్మ పురాణం తెలియజేస్తుంది.



అంబరీష మహారాజు అన్ని ఏకాదశులను అత్యంత నియమంతో ఆచరించేవాడు. ఒకసారి ద్వాదశి పారణ సమయంలో దుర్వాస మహర్షి ఆలస్యంగా రావడంతో ధర్మసంకటంలో పడ్డాడు. శాస్త్రవిధిని కాపాడేందుకు కేవలం తులసీజలాన్ని మాత్రమే స్వీకరించాడు. దుర్వాసుడు కోపించినప్పటికీ, శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రం అంబరీషుని రక్షించింది. ఏకాదశి వ్రతంలో నియమపాలన, వినయం, భక్తి ఎంత ముఖ్యమో అంబరీషుని చరిత్ర తెలియజేస్తుంది. అదేవిధంగా రుక్మాంగదుడు తన రాజ్యంలో అందరూ ఏకాదశి వ్రతం ఆచరించేలా చేసి చివరికి విష్ణులోక ప్రాప్తి పొందినట్లు పురాణాలు వివరిస్తాయి. భీష్ముడు యుధిష్ఠిరునికి ఏకాదశి మహిమను వివరిస్తూ, ఉపవాసం, దానం, విష్ణు భక్తి యొక్క ప్రాముఖ్యతను బోధించాడు. అతని ఉపదేశాలే తరువాత అనేక ధర్మగ్రంథాలకు ఆధారమయ్యాయి. భక్తి, నియమం, విష్ణు స్మరణ, దానం, ధర్మాచరణతో తొలి ఏకాదశిని ఆచరించినవారికి భగవంతుని అనుగ్రహం లభిస్తుందని శా□స్త్రాలు బోధిస్తున్నాయి.

# దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి అమరేశ్వరి

## జూలై 25.. జస్టిస్ కే.అమరేశ్వరి వర్ధంతి

సమాజంలో స్త్రీలకు సరైన గౌరవం, మర్యాద లభించని రోజుల్లో కొందరు మహిళలు, ముందుకు వచ్చి, పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని, స్వయం కృషితో వివిధ రంగాల్లో తమ సత్తా చాటుకుని గుర్తింపు పొంది, సాటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని ఆరోజుల్లోనే నిరూపించారు. తాము తలుచుకుంటే ఏమైనా సాధించగలమని మహిళలు ముందుకు సాగారు. అలాంటి వారిలో జస్టిస్ అమరేశ్వరి ఒకరు. ఒక సాధారణ వ్యవసాయం కుటుంబంలో జన్మించిన ఆమె.. దేశంలో న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో పేదరికం, వివాహం, ఇతర అంశాలు ఏమాత్రం అడ్డురాదని నిరూపించిన ఆమె.. సాటి మహిళల్లో ఏమైనా సాధించగలమన్న చైతన్యాన్ని నింపారు. జస్టిస్ కె. అమరేశ్వరి (కోనమనేని అమరేశ్వరి) భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తిగా చరిత్ర పుటల కెక్కారు.

గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10 వ తేదీన జన్మించారు. 14వ ఏటనే పెళ్ళి జరిగినా భర్త ప్రోత్సాహముతో చదువు సాగించారు.ఆమె 1949 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి పొలిటిక్స్ అండ్ హిస్టరీలో ఎంఏ డిగ్రీని పొంది, అదే విశ్వ విద్యాలయం నుండి బిఎల్, డిగ్రీని కూడా తీసుకున్నారు.

డి.మునికన్నయ్య ఛాంబర్స్‌లో ఆమె అప్రెంటిస్‌షిప్ చేశారు. 1952 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాదిగా చేరారు. గుంటూరుకు, తరువాత హైదరాబాద్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మారగా ఆమె అదే వృత్తిలో కొనసాగారు. 1960-61 మధ్య కాలంలో బార్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు.

అక్టోబర్, 1974 లో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుండి 14-2-1977 వరకు రెండేళ్లపాటు అదనపు న్యాయమూర్తిగా పని చేశారు.

భారత మహిళా న్యాయవాదుల సంఘమునకు ఉపాధ్యక్షులుగా, 1975-76 మధ్యకాలంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వర్తించారు.

1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కాగా, ఉమ్మడి హైకోర్టు తొలి మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ అమరేశ్వరి 29-4-1978 న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. దేశములోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990 సంలో సీనియర్ గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ నుంచి గత 13 సంవత్సరాలుగా సుప్రీంకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సాధించిన మహిళ జస్టిస్ కొనమనేని అమరేశ్వరి, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమరేశ్వరి సమర్థించారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు చట్ట పరమైన పరిణామాలు' అన్న అంశంపై నిర్వహించిన ఒక సెమినార్లో ఆమె తన అభిప్రాయాన్ని ముక్కు సూటిగా వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందుకుంటున్న ప్రైవేటు సంస్థలు సిబ్బంది నియామకంలో రిజర్వేషన్లను అమలు చేయాలని గట్టిగా వాదించారు. మహిళలకు మార్గదర్శకురాలై, న్యాయ వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు పొందిన జస్టిస్ అమరేశ్వరి 2009, జులై 25 న కొత్త ఢిల్లీలో మరణించారు.



## ఈ ఆకులు రెండు

వంటింటి ఔషధం..

# నోట్లో వేసుకుంటే?




పుదీనా మన వంటగదిలో సులభంగా దొరికే సుగంధ మూలిక. ఇది ఆహారానికి ప్రత్యేక రుచిని, సువాసనను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, ఒత్తిడి, తక్కువ శారీరక శ్రమ వంటి కారణాలతో గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం కొంత ఉపశమనాన్ని అందించవచ్చు. అయితే ఇది ఏ వ్యాధికీ ప్రత్యక్ష ఔషధం కాదని గుర్తుంచుకోవాలి. పుదీనాలో ఉండే మెంథాల్ వంటి సహజ సమ్మేళనాలు జీర్ణవ్యవస్థ కండరాలను సడలించడంలో సహాయపడతాయి. దీంతో కొంతమందిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం తర్వాత వేడి పుదీనా టీ లేదా పుదీనా నీటిని తీసుకోవడం జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

**ఎసిడిటీ ఉంటే కాస్త జాగ్రత్త**

పుదీనా కొందరిలో కడుపు అసౌకర్యాన్ని తగ్గించవచ్చు. అయితే GERD (గ్యాస్ట్రోఎసోఫేజియల్ రిఫ్లక్స్) లేదా తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ సమస్య ఉన్నవారిలో గుండెల్లో మంటను పెంచే అవకాశం కూడా ఉంది. అందువల్ల అలాంటి వారు వైద్యుల సలహాతోనే పుదీనాను తీసుకోవాలి.

**నోటి దుర్వాసనకు ఉపశమనం**



పుదీనాలోని సహజ యాంటీబ్యాక్టీరియల్ గుణాలు నోటిలో దుర్వాసనకు కారణమయ్యే కొన్ని సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. భోజనం అనంతరం కొన్ని తాజా పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా మౌత్ రిన్స్ ఉపయోగించడం వల్ల నోరు తాజాగా ఉంటుంది.



**రోగనిరోధక శక్తికి మద్దతు**

పుదీనాలో విటమిన్‌ఎ, విటమిన్ జ, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా సమతుల్య ఆహారంలో భాగంగా పుదీనాను చేర్చుకోవడం



రోగనిరోధక శక్తికి మద్దతునిస్తుంది.



**చర్మ ఆరోగ్యానికి ఉపయోగకరం**

పుదీనాలోని శోథ నిరోధక గుణాలు మొటిమలు, చిన్నపాటి చర్మ వాపులు, అధిక నూనె ఉత్పత్తిని నియంత్రించడంలో కొంతవరకు సహాయపడవచ్చు. కొంతమంది పుదీనా పేస్ట్ లేదా ఫేస్ ప్యాక్‌లను ఉపయోగిస్తారు. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చిన్న ప్రాంతంలో పరీక్షించి ఉపయోగించడం మంచిది.

**బరువు నియంత్రణలో పరోక్ష సహాయం**

పుదీనా నేరుగా బరువు తగ్గించదు. కానీ జీర్ణక్రియను మెరుగుపరచడం, చక్కెర పానీయాలకు బదులుగా పుదీనా నీటిని తీసుకునే అలవాటు ఏర్పడితే మొత్తం కేలరీల వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో బరువు నియంత్రణకు పరోక్షంగా సహాయపడుతుంది.

**పుదీనాను ఎలా తీసుకోవాలి?**

- ఉదయం 5–6 పుదీనా ఆకులను గోరువెచ్చని నీటిలో వేసి తాగవచ్చు.
- పుదీనా–అల్లం హెర్బల్ టీ తయారు చేసుకుని తాగవచ్చు.
- చట్నీలు, సలాడ్లు, శాండ్‌విచ్‌లు, సూప్‌లలో కలిపి తీసుకోవచ్చు.
- నిమ్మరసంతో కలిపి పుదీనా నీరు తయారు చేసుకోవచ్చు.
- మజ్జిగలో పుదీనా, జీలకర్ర పొడి కలిపి తాగితే జీర్ణక్రియకు తోడ్పడుతుంది.
- తీసుకునే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలు
- పుదీనాను అధికంగా తీసుకోవడం అందరికీ అనుకూలం కాదు.
- తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్, కడుపు పూతలు లేదా దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించాలి.
- గర్భిణీలు లేదా కొన్ని మందులు వాడుతున్నవారు క్రమం తప్పకుండా అధిక పరిమాణంలో పుదీనా తీసుకునే ముందు వైద్య సలహా తీసుకోవాలి.
- గ్యాస్, కడుపు నొప్పి, రక్తపు మలం లేదా నిరంతర అజీర్ణం వంటి లక్షణాలు ఉంటే కేవలం ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం



# 29 నుంచి మణిపాల్ హెల్త్ రూ.9275 కోట్ల ఐపీఓ




**దిల్లీ: ప్రముఖ హాస్పిటల్ చైన్ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ. 9,275 కోట్లు సమీకరించే లక్ష్యంతో జులై 29 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ. 560–590గా నిర్ణయించింది. రూ. 77,600 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ చేపట్టనుంది.**

ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 8000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 2.16 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ప్రమోటర్లు అయిన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు టీపీజీ ఎస్‌జీ మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మర్ ఎస్‌డీఎన్ బీహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఆసియా, ఫోనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాలు విక్రయించనున్నాయి.




**ఐపీఓ నిధులు వీటికే**

ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 5,378 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణాలు తిరిగి/ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరో అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటాల కొనుగోలుకు రూ. 574 కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. జులై 28న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకోనుంది. జులై 31న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. క్యూఐబీలకు 75 శాతం, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. ఉద్యోగులకు రూ. 15 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. ఒక్కో షేరుపై రూ. 56 డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇన్వెస్టర్లు కనీసం 25 ఈక్విటీ షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి.

**దేశవ్యాప్తంగా హాస్పిటల్స్**

మణిపాల్ హెల్త్ సంస్థకు దేశవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 38 హాస్పిటల్స్ (ప్రోఫార్మా బేసిస్‌లో 48) కలిగి ఉంది. 10,761 లైసెన్స్‌డ్ బెడ్లు నిర్వహిస్తోంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సేవలందిస్తోంది. 2025 నవంబర్‌లో 49వ హాస్పిటల్‌ను బెంగళూరులో ప్రారంభించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి తొలి ఆరు నెలల్లో రూ. 4,713 కోట్ల ఆదాయాన్ని, రూ. 571.8 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆగస్టు 5న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం గ్రే మార్కెట్‌లో 4 శాతం ప్రీమియం పలుకుతోంది.

విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్..

## స్పష్టతనిచ్చిన సంస్థ




**దిల్లీ:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది.



ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (AEW&C-MKII) వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)ఓ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ విమానయాన రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఊహాగానాలు వచ్చాయి

# వృద్ధి భయాలు.. ఐదో రోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టటీ, ఫార్మా స్టాక్స్




అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# హోండా ధమాకా.. ఒకేసారి 10 మోడళ్ల ఆవిష్కరణ

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన టూవీలర్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. దేశీయ మార్కెట్‌లోకి కొత్తగా 10 మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఏడు పూర్తిగా కొత్తవి కాగా.. మూడు మోడళ్లను అప్‌డేట్ చేసింది. స్కూటర్లు, రోడ్‌స్టర్, క్రూయిజర్, అడ్వెంచర్ విభాగానికి చెందిన టూవీలర్లు ఇందులో ఉన్నాయి. ICE, ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఆప్షన్‌తో లభించనున్నాయి. దేశీయ వాహనదారుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా వీటిని తయారుచేయనున్నట్లు కంపెనీ తెలిపింది. వీటిని దశలవారీగా మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ధర, మార్కెట్‌లో అందుబాటు వంటి వివరాలు ఆయా మోడళ్లను లాంచ్ చేసినప్పుడు కంపెనీ వెల్లడించనుంది.

విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్.. స్పష్టతనిచ్చిన సంస్థ

హోండా ADV160: హోండా తీసుకొస్తున్న అడ్వెంచర్ స్కూటర్ ఇది. 160 సీసీ లిక్విడ్–కూల్డ్ ఇంజిన్‌తో రానుంది. ఇ85 ఇథనాల్ ఫ్యూయెల్‌కు సపోర్ట్ చేస్తుంది. 8.1 లీటర్ల ఫ్యూయెల్ ట్యాంక్, 27 లీటర్ల అండర్–సీట్ స్టోరేజ్ కలిగి ఉంటుంది.



హోండా CB500: సీబీ 350 రేంజ్‌లో 501 సీసీ వేరియంట్‌లో సింగిల్–సిలిండర్, ఎయిర్–కూల్డ్ ఇంజిన్‌తో రానున్న రెట్రో రోడ్‌స్టర్ బైక్ ఇది. రెట్రో లుక్, మంచి రైడింగ్ అనుభవం కోరుకునే వారి కోసం ఈ బైక్‌ను తీసుకురానుంది.

హోండా రెబెల్ 300: 286 సీసీ లిక్విడ్–కూల్డ్ ఇంజిన్‌తో రానున్న ఎంట్రీ–లెవల్ క్రూయిజర్ బైక్ ఇది. స్టాండర్డ్, ఇ–క్లచ్ వేరియంట్లలో లభ్యమవుతుంది.

రెబెల్ 500: 471cc పారలల్–ట్విన్ ఇంజిన్‌తో దేశీయ మార్కెట్‌లోకి మరోసారి రీ ఎంట్రీ ఇస్తున్న మోడల్ ఇది. గతంలో పరిమిత సంఖ్యలో హోండా వీటిని విక్రయించింది. ఇది కూడా స్టాండర్డ్, ఇ–క్లచ్ వేరియంట్లలో లభ్యం కానుంది.

హోండా XR300L: హోండా నుంచి వస్తున్న ఆన్–రోడ్, ఆఫ్–రోడ్ బైక్. 293.5 సీసీ కెపాసిటీతో రానుంది.

XR300 ర్యాలీ: దూరపు ప్రయాణాల కోసం టూరింగ్, అడ్వెంచరస్ బైక్. గ్లోబల్‌గా విక్రయిస్తున్న ర్యాలీ బ్రాండ్ డిజైన్‌తో ఈ బైక్‌ను తీసుకురానున్నారు.


హోండా QC3 ఈవీ: హోండా తన ఈవీ పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది. 3 ఎబౌస్త్ర బ్యాటరీ సామర్థ్యంతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 151 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణిస్తుంది. 2.40 గంటల్లో 0–80 శాతం ఛార్జ్ అవుతుంది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, స్మార్ట్ కీ వంటి ఫీచర్లు ఉన్నాయి.

**ఏమిటీ ఇ– క్లచ్ టెక్నాలజీ:** హోండా కొత్తగా ఇ–క్లచ్ లీవర్ టెక్నాలజీని పరిచయం చేస్తోంది. ట్రాఫిక్‌లో వాహనాన్ని నడపడం సులభతరం చేయడం కోసం క్లచ్ లీవర్‌ను ఉపయోగించకుండానే గేర్లు మార్చే సదుపాయం తీసుకొస్తోంది. ఈ సిస్టమ్ ఆటోమేటిక్‌గా క్లచ్ ఆపరేషన్స్‌ను నిర్వహిస్తుంది. మాన్యువల్‌గా ఆపరేట్ చేసే అవసరం ఉండదన్నమాట.

## రాత్రుళ్లు నిద్రపట్టక

# ఇబ్బంది పడుతున్నారా.?


**నేటి ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, మానసిక ఆందోళనల వల్ల రాత్రివేళల్లో సరైన నిద్ర లేక బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మంచంపై పడుకున్నప్పటికీ గంటల తరబడి నిద్రపట్టక కళ్లు మూసుకుని అటుఇటూ దొర్లుతుంటారు. మీరు కూడా ఇలాంటి సమస్యతోనే బాధపడుతున్నారా? అయితే మీకు మిలిటరీ స్లీప్ మెథడ్ ఎంతో సహాయపడుతుంది. కేవలం 120 సెకన్లలో అంటే 2 నిమిషాల్లో ప్రశాంతమైన, గాఢమైన నిద్రలోకి జారుకోవడానికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. అసలు ఏమిటి మిలిటరీ స్లీప్ మెథడ్..?**



**మిలిటరీ స్లీప్ మెథడ్ అంటే ఏమిటి..?**

అమెరికన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ కోచ్ లాయిడ్ బడ్ వింటర్ రాసిన రిలాక్స్ అండ్ విన్: ఛాంపియన్‌షిప్ పెర్ఫార్మెన్స్ పుస్తకంలో ఈ సాంకేతికత గురించి ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రతికూల పరిస్థితుల్లో కూడా అమెరికన్ నేవీ పైలట్లు త్వరగా నిద్రపోయి, చురుగ్గా పనిచేసేందుకు ఈ విధానాన్ని రూపొందించారు. 6 వారాల పాటు క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా 96శాతం మందిలో ఇది విజయవంతమైన ఫలితాలను ఇచ్చింది.

**ఈ పద్ధతిని ఎలా పాటించాలి?**



కళ్లు మూసుకుని, ముఖం, కళ్లు, గడ్డం, దవడలు, నోటి కండరాలలోని ఒత్తిడిని పూర్తిగా వదిలేయండి. భుజాలను సాధ్యమైనంత కిందకు దించి, చేతులను శరీరం ఇరువైపులా ప్రశాంతంగా ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంటూ, ఛాతీ భాగం ప్రశాంతంగా మారేలా గాలిని బయటకు వదలండి. కాళ్లను విశ్రాంతిగా ఉంచండి అంటే.. తొడలు, పిక్కలు, పాదాల వరకు ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి లేకుండా చూడండి.

చివరిగా 10 సెకన్ల పాటు మీ మనస్సులో ఎటువంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని పచ్చని కొండలు, ప్రశాంతమైన సముద్ర తీరం వంటివి ఊహించుకోండి. ముఖం, భుజాలు, చేతులు, కాళ్లలోని కండరాలను క్రమపద్ధతిలో సడలించి ప్రశాంతంగా ఉంచాలి. నెమ్మదిగా, దీర్ఘంగా శ్వాస తీసుకుంటూ శరీరంలోని ఒత్తిడిని పూర్తిగా బయటకు పంపాలి. 10 సెకన్ల పాటు మనస్సులో ఎటువంటి ప్రతికూల ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన ప్రకృతి దృశ్యాలను ఊహించుకోవాలి.

ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ పద్ధతి వెంటనే ఒకే రోజులో ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. కనీసం 6 వారాల పాటు సాధన చేస్తేనే మెదడు, శరీరం దీనికి అలవాటు పడతాయి. అలాగే నిద్రపోయే సమయానికి కనీసం అర్ధగంట ముందు మొబైల్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండటం మంచిది.

## మసకగా ఉన్న కంటిచూపు పూర్తిగా పోవాలంటే....

# ఒక చెంచాడు తింటే..?

**ఇంకా దీనిలో శరీరానికి కావాల్సిన పోషకాలు ఉన్నాయి. అవిసె గింజలు, వాల్ నట్స్‌లాగే ఇవి అంతే. ఇంకా ఇవి ఆయుర్వేదంలో కూడా వీటిని వాడుతారు. అయితే ఈ హలీం గింజల్ని ఎక్కువగా జుట్టు రాలడానికి తగ్గించడంలో వాడతారు. ఇంకా వీటిలో ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యంగా ఉంచేందుకు కూడా ఇది హెల్ప్ అవుతాయి. ఇంకా ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.**



**వీటిని తింటే ఎన్నో లాభాలు :** హలీం గింజలు తింటే శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. ఇంకా బ్లడ్ లో హిమోగ్లోబిన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి. ఇంకా శ్వాస కోశ సమస్యలు కూడా దూరమవుతాయి. ఇంకా అలసట, నీరసం, జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి. కాబట్టి, వీటిని తింటూ ఉండండి.

మసకగా ఉన్న కంటిచూపు పూర్తిగా పోవాలంటే ఒక చెంచాడు తింటే చాలు విజన్ 100% అమాంతం పెరుగుతుంది. వీటిలో ఎక్కువగా విటమిన్లు ఎ, ఇలు ఉంటాయి. ఈ హలీం గింజల్ని తీసుకుంటే చర్మం కూడా కాంతి వంతంగా మెరుస్తుంది. ఇవి శరీరంలోని ఆక్సీకరణ స్ట్రెస్ ను కూడా ఇవి తగ్గిస్తాయి. జుట్టుకు కూడా బలాన్ని ఇస్తుంది.

# అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు



**ఆమనగల్లు, జూలై 24(నినాదం):** ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డు, సర్వే నెం. 662/ఆ/2 లో చట్టవిరుద్ధంగా అనుమతులు లేకుండా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కాలనీ వాసులు కలెక్టర్ కు పిర్యాదు చేశారు, సర్వే నెం. 662/ఆ/2లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పేలుళ్ల వల్ల భారీ శబ్ద, దుమ్ము కాలుష్యం ఏర్పడటమే కాకుండా, ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పర్యావరణ నిబంధనలను, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి సాగిస్తున్న ఈ మైనింగ్ కార్యకలాపాలపై అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ ఫిర్యాదుపై అత్యవసరంగా స్పందించి తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరినట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుక శివ, పులికంటి మహేష్, గోరేటి జగన్, వంకశ్వరం బీమయ్య పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట బ్యూరో, జూలై 24 (నినాదం):** జిల్లా పరిధిలోని కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. రాష్ట్రంలోనే నిర్మాణ పురోగతిలో ఖమ్మం జిల్లా తో సమానంగా అగ్రస్థానంలో కొనసాగుతుందని, 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ అని చెప్పారు . మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో యుద్ధ ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్ల మద్య నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మెడల్ గా నిలుస్తుందని తెలిపారు.

## ఢిల్లీ నిరసనకారులపై పోలీసుల అత్యుత్సాహం సరికాదు

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



**కొడంగల్, జులై 24(నినాదం):** నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ పైన విద్యార్థులు ఢిల్లీ నడి బొడ్డున జంతర్,మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థుల పైన ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ యువతీ, యువకుల పైన లాఠీఛార్జీలు చేస్తూ, టియర్ గ్యాస్‌ను ఉపయోగిస్తూ అనేకమంది విద్యార్థిని విద్యార్థులను గాయపరిచి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, ఈ లాఠీ తూటాలకు యువతి మృతి పట్ల కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్యలు మాట్లాడుతూ పేపర్ లీకేజీ పైన ప్రశ్నిస్తే పోలీసులు ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడడం సరికాదని ఢిల్లీ పోలీసులు మరిచిపోయి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా ప్రవర్తిస్తూ ఎంతో మంది విద్యార్థులను లాటిలు,తూటాలతో పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ నుంచి ప్రజల మైండ్ డైవర్ట్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకమే ఈ లాటి చార్జ్ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకొని, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారం సాయిలు, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సకల సంపదలకు చదువువే ఆధారం

వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్, జూలై 24(నినాదం ):** సకల సంపదలకు చదువువే మూలధారమని వికారాబాద్ మిన్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరి పల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఎక్కడైనా జీవించగలడని అన్నారు. చదువుకునే ప్రాయంలో చదువు విలువ తెలియదని అన్నారు. విలువ తెలుసుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. చదువే అసలైన ఆస్తిగా భావించాలని ఏ ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. విద్యతోనే వికాసమని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాకేష్, మాజీ కౌన్సిలర్ మురళి, టిపిసిసి రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్. అనంతయ్య, పట్టణ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. శ్రీకాంత్, బాలరాజు, గంగారం శ్రీకాంత్, సోషల్ మీడియా నందు, సాయి, హరి, తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్బంధం లో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి



**నాచారం, జులై 24 ( నినాదం ):** బీఆర్ఎస్‌వీ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు. ఢిల్లీలో నీట్ బాధిత విద్యార్థులకు మద్దతుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర పోలీసు బలగాలు అమానుషంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ, బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి బయలుదేరిన మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని పోలీసులు వారి నివాసంలోనే గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని ఆయన అన్నారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరుకావడాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం దురదృష్టకరం అని ప్రజల గొంతుకను అణిచివేసే ప్రయత్నాలు ఎంత చేసినా విద్యార్థుల పక్షాన బీఆర్‌ఎస్‌వీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉంది , అలాంటి హక్కును హరించే విధంగా వ్యవహరించడం పోలీసు యంత్రాంగానికి తగదు అని దేవేందర్ రెడ్డి అన్నారు.

# ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

- విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ఏకరూప దుస్తులు అందించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో

**సంగారెడ్డి బ్యూరో, జూలై 24 (నినాదం):** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి ఆగస్టు నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, వంషపాతం పరిస్థితులు, ఖరీఫ్ పంటల సాగు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలను నిర్వహించి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపునకు అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, అవసరమైన యూనిఫాంల వివరాలను అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. క్రాప్ డైవర్సిఫికేషన్‌కు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు పాల్గొన్నారు.

## పుల్కల్ మండలంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృత పర్యటన

కేజీబీవీ, పీహెచ్‌సీ తనిఖీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన





**సంగారెడ్డి బ్యూరో, జూలై 24 ( నినాదం ):** విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం కల్పించడానికి సంబంధిత అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ పుల్కల్ మండలంలో పర్యటించి మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి లిప్రాథమిక ఆరోగ్య కేంద్రం నులి సందర్శించిన కలెక్టర్, నూతనంగా నిర్మించిన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,త్వరగా మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. అనంతరం పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ, డార్మిటరీ, తరగతి గదులు, స్టోర్‌రూమ్, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఈగలు, దోమలు పెరగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా పరిశుభ్రతను పాటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలనిసూచించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, వారితో పాఠ్యాంశాలను చదివించి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు నోట్‌బుక్‌లను అందజేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారికి ఉద్బోధించారు. కలెక్టర్ వెంట ఆయా కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ఎం ఈ ఓ, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## కామన్ డైట్ మెనూ తప్పనిసరి పాటించాలి

జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట బ్యూరో, జూలై 24 (నినాదం):** జిల్లాలోని అన్ని గురుకులాలో విద్యార్థులతో మెస్ కమిటీలు వేసి, వంట సరుకులను వారి సమక్షంలో అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రిన్సిపల్ లను ఆదేశించారు. కోహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ శుక్రవారం రోజున ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, క్యాబేజీ, పప్పు, రసం, పెరుగులను తనికి చేశారు. కూరలు నాణ్యతతో పాటు రుచికరంగా ఉన్నాయా అని విద్యార్థులతో ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వండిన ప్రతి వంటకం రుచికరంగా విద్యార్థులందరికీ సరిపోయేలా వండాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ తనికి చేశారు. రికార్డు రాయకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సిబ్బందికి సరుకులు అందించే ముందు గురుకులంలో విద్యార్థులతో వేసిన మేస్-కమిటీ సమక్షంలోనే అందించాలని ఇష్టానుసారంగా జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సంబంధించి సరుకులు కొలత ప్రకారం అందించినప్పుడే రికార్డులో రాయాలని ఇలా రాయకపోవడం పైన విచారణ జరపాలని డిసిఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

## వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ప్రమీల



**వికారాబాద్, జూలై 24(నినాదం ):** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్ ను శుక్రవారం వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీ ఐ గా బదిలీపై వచ్చిన ప్రమీల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేశారు. విధినిర్వహణలో ఆదర్శవంతమైన సేవలను అందించాలని సూచించారు.

## ఆశా వర్కర్లకు రూ.18000/- వేతనం ఇవ్వాలి

- తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి



**అల్వాల్, జూలై 24( నినాదం):** ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ,కార్మిక వర్గ ప్రయోజనాల కోసం, మహిళల హక్కుల సాధన కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన అమరజీవి, ప్రముఖ కమ్యూనిస్టు నేత లిలికామ్రేడ్ విమల్ రణదివే 26వ వర్ధంతి జరిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆమెకు హృదయపూర్వక విప్లవ నివాళులు అర్పిస్తోంది.మహిళా కార్మికులను సంఘటితం చేసి, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి బలమైన పునాదులు వేసిన కామ్రేడ్ విమల రానా దేవి నిరంతర పోరాట జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సీఐటీయూ కొనియాడింది. 1915 ఏప్రిల్ 10న జన్మించిన ఆమె, కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్రిటిష్ వలస పాలకులను ధైర్యంగా ఎదుర్కొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. క్షమాపణ చెప్పడానికి నిరాకరించి తన అచంచల దేశభక్తిని, ధైర్యాన్ని చాటుకున్నారు. పేదలు, కార్మికుల పట్ల ఉన్న ఆత్మీయతతో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్వీకరించిన ఆమె.. జైలు జీవితం, అజ్ఞాతవాసం వంటి కష్టాలను లెక్కచేయలేదు. 1946లో జరిగిన ముంబై కార్మిక వర్గం, నౌకాదళ సైనికుల చారిత్రాత్మక తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నారుఅనంతరం యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కోమలి మాట్లాడుతూనేటి ఉద్యోగ మహిళల సమస్యలు కామ్రేడ్ విమల్ రణదివే ఆశయ సాధనలో భాగంగా, నేటి సమాజంలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై సీఐటీయూ పురుషులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ అనేక రంగాల్లో మహిళలకు నేటికీ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. 'సమాన పనికి సమాన వేతనం' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు కార్మిక హోదా:లిలి అంగన్‌వాడీ, ఆశా. మధ్యాహ్న భోజన పథకం వంటి రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది మహిళలను ప్రభుత్వాలు 'కార్మికులుగా' గుర్తించి, రూ. 26,000 కనీస వేతనం, ఈఎస్ఐ పిఎఫ్ వంటి సామాజిక భద్రత కల్పించాలి డిమాండ్ చేశారు. సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి కే ఉన్నికృష్ణ మాట్లాడుతూ పని ప్రాంతాల్లో రక్షణ చట్టఅమలు ఐటీ, ఫ్యాక్టరీలు, సేవా రంగం, గిగ్ ఎకానమీ మరియు అసంఘటిత రంగాల్లో మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలి. లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రతి పని ప్రదేశంలో 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' లను ఏర్పాటు చేసి కఠినంగా అమలు చేయాలి లేనిపక్షం లో పోరట్టని ఉధృతం చేస్తాం హెచ్చరించారుమహిళా కార్మికులను శాశ్వ స్వరూపం ఉన్న పనుల్లో సైతం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో తక్కువ వేతనాలతో శ్రమదోపిడీ చేయడాన్ని అరికట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలని,మాతాశిశు సంక్షేమం ఉ మౌలిక సదుపాయాలు:లిలి అన్ని రంగాల మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, పని ప్రదేశాల్లో ఉచిత శిశు సంరక్షణ కేంద్రాలు, రాత్రి షిఫ్టులలో పనిచేసే మహిళలకు సురక్షిత రవాణా వసతి కల్పించాలనీ కోరారు. కామ్రేడ్ విమల్ రణదివే అందించిన పోరాట స్ఫూర్తితో.. కార్మిక వర్గంపై, ముఖ్యంగా మహిళా కార్మికులపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీలు, లింగ వివక్షను అంతం చేయడానికి సీఐటీయూ పునరంకితమవుతోంది. ప్రతి కార్మికునికి హక్కులు, గౌరవం, సమానత్వం సాధించే వరకు, న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం కోసం ఆమె ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతిజ్ఞ చేస్తోంది. ఈ కార్యక్రమంలో అల్వాల్ మచ్చ బొల్లారం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


## డంపింగ్ యార్డ్ పై 26న అవగాహన సదస్సు

మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు ఆహ్వానం



**జవహర్ నగర్, జులై 24 (నినాదం):** పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత కోసం జరుగుతున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని డంపింగ్ యార్డ్ పై ఈనెల 26న స్వర్ణాంధ్ర డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే అవగాహన సదస్సుకు పెద్ద ఎత్తున హాజరుకావాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి శివ బాబు పిలుపునిచ్చారు. చెత్త డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత జీవించే హక్కు పై డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న అవగాహన సదస్సుకు మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ను శుక్రవారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, రమేష్ చారి, సామాజిక నాయకులు బూడిద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కొడంగల్, జులై24(నినాదం):** బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత,మాజీ మంత్రి కెటిఆర్ జన్మదిన వేడుకలు బొంరాస్ పేట్ మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట్లయాదగిరి,మహేందర్ రెడ్డి,నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గుండుగారి తిరుపతయ్య,శ్రావణ్ గౌడ్, రవిగౌడ్,శ్యామలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కొడంగల్ లో రెండో వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ యాదవ్ ఇంట్లో కెటిఆర్ జయంతి వేడుకలు కాలనీ వాసులతో ఘనంగా జరుపుకున్నారు. రుద్రారం గ్రామంలో పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కెటిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

## ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, జూలై 24 (నినాదం) :** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ని తీవ్రంగా ఖండిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నా-నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు తో కలిసి పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై దౌర్జన్యానికి పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూసే చర్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు వివరించారు.

## విద్యార్థుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

- బిఆర్ఎస్‌వి ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, జూలై 24( నినాదం):** ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణి, దాష్టీకానికి నిరసనగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) గారితో కలిసి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు అల్వాల్ సర్కిల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అల్వాల్ నుంచి ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి మీదుగా వందలాది కార్లతో భారీ ర్యాలీగా బయలుదేరి ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారి భావ ప్రకటనా స్వేచ్ఛను, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, శ్రీధర్ గౌడ్, సురేష్, భాస్కర్ రెడ్డి, అరవింద్, శ్రీనివాసులు, హేమంత్ రెడ్డి, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, గౌస్ ఇమ్రాన్, నర్సింగ్ రావు, శోభా పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**పైపులైన్ లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్లపై కట్టడి.. ఎల్ఎండీ నీటి నిల్వలపై నిత్య పర్యవేక్షణకు ఆదేశం: కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జులై24(నినాదం):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్త కుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, ప్రజారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, నీటి నిల్వలు, వినియోగం, పొదుపు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. పైపులైన్ లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనిచేయని బోర్లను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కొత్తపల్లి--ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంటతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ డెడ్ స్టోరేజ్ పరిస్థితి రాకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి--జంగంపల్లి ప్రాంతాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృత అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్లు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీల ప్రారంభం

**చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు అతిథుల పిలుపు**

**చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ**



**కరీంనగర్, జులై24(నినాదం):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చొప్ప దండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ వకాడే, సహాయ కలెక్టర్ పి. హరిప్రసాద్, సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల కేరింతల మధ్య క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించి, ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయని, సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్‌లో క్రీడలకు పెద్దపీట వేస్తూ, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే క్లస్టర్ క్రీడల్లో విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు భరత్ కుమార్, కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, కార్పొరేటర్ వాసాల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు వేముల చంద్రశేఖర్, డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## చేనేత ఉత్పత్తులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

**కులవృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం**

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్**



**జమ్మికుంట జులై 24 (నినాదం):** చేనేత ఉత్పత్తులను పెంచడం ద్వారా చేనేత వృత్తుల వారికి చేయూత ఇస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చేనేత కుల వృత్తులను ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సమీకృత వస్త్రోత్పత్తి కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కమిటీ వారిని సన్మానించారు. కేంద్రంలో జరుగుతున్న పనులను,దినసరి వేతనం గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం,సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ఉపాధ్యక్షులు తిరుపతయ్య,కోశాధికారి మహదేవ్,కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమే**

## ఉపాధ్యాయులుగా సుధాకర్ సేవలు అభినందనీయం..

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట, జులై 24 (నినాదం):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని సుమారు 40 సంవత్సరాలుగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సుధాకర్ సార్ కు దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి విరమణ పొందుతున్న సుధాకర్ సార్ సేవలను చైర్మన్ అభినందించారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ తన సేవలను వీలైనప్పుడల్లా విద్యార్థులకు అందించాలని తమ అనుభవాలను రాబోయే తరం టీచర్లకు తెలుపుతూ వారి శేష జీవితం ఆనందమయంగా గడపాలని కోరారు. అనంతరం సుధాకర్ ను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ప్రభుత్వ క బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై బీజేవైఎం సమరభేరి

**'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' పోస్టర్ ఆవిష్కరణ.. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని గంగాడి కృష్ణారెడ్డి**




**కరీంనగర్, జులై 24(నినాదం):** భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. సుమారు రూ. 15 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. కరీంనగర్ జిల్లాలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేవైఎం ఆధ్వర్యంలో నిరంతర ఆందోళనలు కొనసాగిస్తామని, బకాయిలన్నీ విడుదల చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరెడ్డి, గుజ్జ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నిర్మలా రెడ్డి, నాయకులు సునీత, శశిధర్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాత ఆశయాలను కొనసాగిస్తా.. ప్రజలకు మరింత సేవ చేస్తా..





**వొడితల ప్రణవ్..**

**ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు వర్ధంతి**

**జమ్మికుంట, జులై 24 (నినాదం) :** రాజ్యసభ సభ్యుడిగా,రాజకీయాల్లో ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన మహానుభావుడు వొడితల రాజేశ్వర్ రావు అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన వర్ధంతి సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు ప్రణవ్. ఈ సంద ర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు,ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి ప్రణవ్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని, ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని, ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు. వారు చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సి లర్లు,దేవాలయాల చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్,బీసీ ఎస్సీ, యువజన, సేవాదళ్, అనుబంధ సంఘాలు, సోషల్ మీడియా, యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో నిరాడంబరంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, జులై 24(నినాదం):** కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ, ప్రత్యేక పూజలు, అల్పాహార వితరణ కరీంనగర్, జూలై 24: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని కరీంనగర్ జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలతో నిరాడంబరంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు దూరంగా ఉండి ప్రజా సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. రేగుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏడాదికి సరిపడా నోటుపుస్తకాలు, పెన్నులు, ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజా సేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. మార్కెట్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కూరగాయల వ్యాపారులు, బాటసారులకు అల్పాహారం పంపిణీ చేశారు. 32వ డివిజన్ హుస్సేనీపురాలోని మదర్సాలో కార్పొరేటర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. అలాగే 33వ డివిజన్‌లో కార్పొరేటర్ జమ్ము ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలు, బలపాలు, కంపాస్ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి. వి. రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మైనారిటీ విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి

**బీఎల్‌వోలు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలి  అదనపు సిబ్బంది కేటాయింపుపై కమిషనర్‌కు విజ్ఞప్తి**

**కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్, జులై 24(నినాదం):** సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఒక్క అర్హ ఓటు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా వంద శాతం పూర్తి చేసేలా కాంగ్రెస్ బీఎల్ఏలు, పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్ కాన్పూరా, ప్రియదర్శిని కాలనీ, 54వ డివిజన్ అశోక్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలు, పార్టీ నాయకులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకుని, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంగ్రెస్ నాయకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటర్ల చిరునామాలు, ఫోన్ నంబర్లు గుర్తించడంలో అవసరమైన సహాయం చేయాలని సూచించారు. అదనపు సిబ్బందిని నియమించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు ఒకే ఓటును కొనసాగించేందుకు అవసరమైన గణన పత్రాలను అందించాలని, ఏ ఓటును కొనసాగించాలన్నది పూర్తిగా ఓటరే నిర్ణయించుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి బీఎల్‌వోలకు ఏవైనా సందేహాలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, నిర్లక్ష్యం లేదా అవగాహన లోపం వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని రాజేందర్‌రావు అన్నారు. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ గణన పత్రాల నింపడంలో కాంగ్రెస్ నాయకులు సహకరించి, సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ కమిటీ సభ్యుడు పద్మాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా ఆఫ్రీన్, ఇక్రం సికిందర్, 54వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోవిటి సామ్రాట్, ఖాజా, షహన్‌షా, గండి శ్యామ్, గండి గణేష్, వేల్పుల వెంకటేష్, సముద్రాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

**అన్ని మండపాలకు ఉచిత విద్యుత్, రహదారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: మేయర్ శ్రీనివాస్**



**కరీంనగర్, జులై24(నినాదం):** కరీంనగర్ నగరంలో రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లకు అధికారులు చర్యలు ప్రారంభించారు. శుక్ర వారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో మేయర్ ఉత్సవాల ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. వినాయక మండపాలకు వెళ్లే ప్రధాన రహదా రుల్లో గుంతలు పూడ్చడం, అవసరమైన చోట్ల రహదారి మరమ్మ తులు చేపట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని వినాయక మండపా లకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. మండపాల విద్యుత్ బిల్లులను నగరపాలక సంస్థ నిధుల ద్వారా చెల్లించే ప్రతిపాదనను పరిశీలి స్తున్నట్లు వెల్లడించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరిం చుకుని టవర్ సర్కిల్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయ అలంకరణలతో సుందరీకరించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్, మున్సిపల్, పారిశుధ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి బాధ్యతలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం మరియు అన్ని శాఖల సమన్వయంతో ఈసారి వినాయక నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన సౌకర్యాల కల్పనకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఉత్సవాలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా నగరపాలక సంస్థ అన్ని విధాలుగా చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని విద్యార్థి మృతి



**జమ్మికుంట, జూలై 24 (నినాదం):** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన రావి కంటి సుజల్(18) అనే విద్యార్థి తన స్నేహితుడు అబ్బిడి అశ్విత్ తో కలిసి జగ్గయ్య పల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ తరుణంలో రెండు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో సుజల్ కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాధితున్ని హన్మకొండ ఆసుపత్రికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రావి కంటి వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## విధి నిర్వహణలో ఆగిన ఫైర్ కానిస్టేబుల్ గుండె



**జమ్మికుంట, జూలై 24 (నినాదం)** పోలీసు విధులు నిర్వహిస్తున్న సమయంలో అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా పని చేస్తున్న ఓ పోలీస్ గుండె ఆగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మోటం అరవింద్(29) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వేళ విధినిర్వహణలో ఉండగా వాకింగ్ చేసేందుకు బయటకు వెళుతున్న తరుణంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి ఉద్యోగులు సి పి ఆర్ చేసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత సంవత్సరం క్రితం వీణవంక మండల కేంద్రానికి చెందిన అరవింద్ కు ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ఓ యువతితో గత తొమ్మిది మాసాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

## సర్‌పై విస్తృత స్థాయి సమావేశం..



**జమ్మికుంట, జూలై 24 (నినాదం)** రాష్ట్రంలో సమగ్ర ఓటు సవరణ నమోదు ప్రక్రియ(సర్ ) సమయం దగ్గర పడుతున్నా కొద్ది కాంగ్రెస్ పార్టీ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ ల పని తీరుపై,సందేహాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు సుడా మాజీ చైర్మెన్,హుజూరాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.. శుక్రవారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమలాపూర్,వీణవంక మండల పరిధిలోని గ్రామాల బిఎల్ఏ,కో ఆర్డినేటర్లతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు బిఎల్ఏ వద్ద ఉన్న పూర్తి సమాచారం కో ఆర్డినేటర్ల వద్ద ఉందా లేదా అని ప్రశ్నించారు?గ్రామాల్లో ఓటు నమోదు ఫారం రాకపోతే బిఎల్ఒఏ కో ఆర్డినేటర్లకు తెలపాలని అక్కడ నుండి మాకు చేరవేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్ పై సీరియస్ గా దృష్టి పెట్టింది కావున ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజూరాబాద్ కి సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలిపారని తెలిపారు. తెలిసి ఒక్క కూడా వృధా కాకుండా చూడాలని కార్యకర్తలకి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్,వీణవంక మండల నాయకులు,గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశ తలరాత మార్చే శక్తి యువతకే ఉంది..

**యువతపై బిజెపి సర్కార్ దాడి హేయమైన చర్య**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**


**కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన**



**జమ్మికుంట జులై 24 (నినాదం):** ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర బీజేపీ సర్కార్ కొనసాగిస్తున్న అణచివేత కు నిరసనగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువతతో పెట్టుకుంటే దేశాలే సర్వనాశనం అయ్యాయని అన్యాయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నది కేంద్ర ప్రభుత్వమని మండిపడ్డారు. యువత విద్యార్థుల స్వరం మారుతోంది నవతరం మేల్కొంటుందని ఈ తరం యువకులు సీబీఐ, ఈడీ, ఐటీ బెదిరింపులకు భయపడదని విద్యార్థులు కోరేది అధికారం కాదు న్యాయం, భవిష్యత్తు మాత్రమే 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను మోసం చేశారని అన్నారు. మేక్ ఇన్ ఇండియా అని చెబుతూ లీక్ ఇన్ ఇండియా గా మార్చారని ఇది రాజకీయ కార్యక్రమం కాదని విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కేసులు వెంటనే ఎత్తివేయాలని భవిష్యత్ నిర్మాతలైన యువత కు కేంద్రం జవాబు చెప్పాల్సిందే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురేష్ మంద రాజేష్ పొన్నగంటి రాము మైనార్టీ నేత జానీ టిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ తదితరులు పాల్గొన్నారు...

## చెత్త బయట వేస్తే అపరాధ రుసుము

**మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, జూలై 24 (నినాదం):** మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక స్వీట్ హౌస్ మరియు ఒక కిరాణా దుకాణం యాజమాన్యాలు తమ వ్యాపార సంస్థల చెత్తను రోడ్డుపై వేయడం గుర్తించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయా రెండు వ్యాపార సంస్థలకు రూ. 1,000 చొప్పున అపరాధ రుసుము విధించారు. వ్యాపారులు తమ దుకాణాల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనానికే అందజేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు కె. కిరణ్, దొడ్డ సంపత్ పాల్గొన్నారు.

# సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 24(నినాదం):** బల్క్ ల్యాండ్ సమస్యలు పరిష్కారానికి చేపట్టిన సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో బుల్క్ ల్యాండ్, రీ సర్వే, సర్ ప్రక్రియపై భూపాలపల్లి డివిజన్ రెవెన్యూ డివిజన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బల్క్ ల్యాండ్ సమస్యలపై గ్రామాల వారీగా సర్వే నిర్వహించి నివేదికలు అందచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. సర్వే నివేదికల ఆధారంగా సంబంధితులకు నోటీసులు జారీ చేసి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రీ-సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో బల్క్ ల్యాండ్ ఇష్యూస్ ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే రీ-సర్వే నిర్వహించిన పైలెట్ గ్రామాల నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. రీ-సర్వే పనుల్లో మండలాల వారీగా జీపీఓలతో సమన్వయం చేసుకుని సర్వే నిర్వహించాలని, సర్వే విధులు నిర్వహించని లైసెన్స్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడిని ఆదేశించారు. భూ సర్వే జరుగుతున్న గ్రామాలలో రైతులు సర్వేకు సహకరించాలని సూచించారు. సర్వే జరుగుతున్న సమాచారం గ్రామంలో టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో సాధాబైనామా కింద మొత్తం 39,300 దరఖాస్తులు అందగా, ప్రస్తుతం 26,698 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, ఈ సెక్షన్ పర్యవేక్షకులు హరిహర ప్రసాద్, భూపాలపల్లి డివిజన్ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఒక్క ఓటు కూడా వృధా కాకుండా చూడాలి



**కమలాపూర్, జులై 24 (నినాదం):** గ్రామాల్లో హర్వులైన ఒక్క ఓటుకుడా నష్ట పోకుండా చూడాలని హుజురాబాద్ సర్ ప్రక్రియ ఇంచార్జ్ కోమటిరెడ్డి నరేందర్, పార్టీ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్ లు కాంగ్రెస్ కార్యకర్తలకు తెలిపారు. రాష్ట్రంలో సమగ్ర ఓటు సవరణ నమోదు ప్రక్రియ(సర్ ) సమయం దగ్గర పడుతున్నా కొద్ది కాంగ్రెస్ పార్టీ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ ల పని తీరు,సందేహాలపై కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమలాపూర్ మండల పరిధిలోని గ్రామాల బిఎల్ఏ,కో ఆర్డినేటర్ల తో ముఖ్య సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు బిఎల్ఏ వద్ద ఉన్న పూర్తి సమాచారం కో ఆర్డినేటర్ల వద్ద ఉందా లేదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో ఓటు నమోదు ఫారం రాకపోతే బిఎల్ఓ కో ఆర్డినేటర్లకు తెలపాలన్నారు. అక్కడ నుండి మాకు చేరవేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్ పై సీరియస్ గా దృష్టి పెట్టిందన్నారు. ఈ మధ్య కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజురాబాద్ కి సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలిపారని తెలిపారు. తెలిసి ఒక్క కూడా వృధా కాకుండా చూడాలని కార్యకర్తలకి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్, మండల బి ఎల్ ఏ లు,కో ఆర్డినేటర్ లు, నాయకులు,గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఏ రద్దు చేయాలి



**భూపాలపల్లి జూలై 24( నినాదం):** ఎన్ టి ఏ ను వెంటనే రద్దుచేసి కేంద్ర విద్యా శాఖ మంత్రిని తొలగించాలని టిఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపుతో శుక్రవారం జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు బందు నిర్వహించగా మంచి స్పందన లభించింది. బందుకు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు, ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ అంబేద్కర్ కూడిన లో జరిగిన ధర్నాలో మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పై విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఎన్ టి ఏ ను రద్దుచేసి విద్యా శాఖ మంత్రిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెప్పడతామని హెచ్చరించారు.

## రాహుల్‌గాంధీ అరెస్టు, విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తూ ర్యాలీ

● మంగపేటలో కాంగ్రెస్ శాంతియుత నిరసన



**ములుగు ప్రతినిధి, జూలై 24 (నినాదం):** లోక్‌సభ ప్రతిపక్షనాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు, నీట్ పేపర్ లీకేజీని ప్రశ్నించినందుకు విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీగా వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న రాహుల్ గాంధీ గారు నీట్ పేపర్ లీకేజీ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ అమాయక విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆయన అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జి చేయడం, విద్యార్థులనే దోషులుగా చిత్రీకరించడం అత్యంత అమానుషమని, ఖండనీయమని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆర్.టి.ఐ ఏ హ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, మంగపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాడిషా ఆదినారాయణ, జిల్లా, బ్లాక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, మండల కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

● రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ
● పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు



**మహాముత్తారం, జూలై 24(నినాదం):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహాముత్తారం మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ చేపట్టిన 'గ్రీన్ ఛాలెంజ్' స్ఫూర్తితో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, బోర్లగూడెం సర్పంచ్, మహాముత్తారం మండల బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అజ్మీర ధరమ్ సింగ్, మాజీ సర్పంచ్ వనజ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చీకట్ల లింగయ్య గౌడ్, కనుకునూరు మాజీ సర్పంచ్ లక్ష్మీ రాంబాబు, సింగంపల్లి ఉపసర్పంచ్ రవీందర్, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని లక్ష్మయ్య, బోడ బాలాజీ, సత్తిరెడ్డి, పంగ సంపత్, స్రవంతి, కొయ్యల రమేష్, మహేష్, బెల్లంకొండ పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పడవపందెం పోటీలకు కౌనిక్ వర్ధన్ ఎంపిక



**కమలాపూర్,జులై 24 (నినాదం):** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వంగపల్లి గ్రామానికి చెందిన దేవరాజు కౌనిక్ వర్ధన్ ప్రతిష్టాత్మక 2026 ఇంటర్నేషనల్ క్యాడెట్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ (పడవ పందెం పోటీల)కు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ డా రవిందర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్ఈఐఎస్ సొసైటీల తరపున కౌనిక్ వర్ధన్ ఈ పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ అంతర్జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీలు ఇటలీలోని టోర్బోల్ సుల్ గార్డా వేదికగా జూలై 30 నుండి ఆగస్టు 7 వరకు జరగనున్నాయన్నారు. ఏడవ తరగతిలో కౌనిక్ వర్ధన్ 2023-24 విద్యా సంవత్సరంలో సమ్మర్ క్యాంప్ ద్వారా యాచింగ్, సెయిలింగ్ శిక్షణకు ఎంపికయ్యాడు. 2024లో సికింద్రాబాద్‌లో జరిగిన 16వ యాచ్ మాన్సన్ రెగట్టాలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. 2025లో మేఘాలయలోని షిల్లాంగ్‌లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లోనూ తమ ప్రతిభను చాటారు. 2026లో 4e YAI నార్త్ ఈస్ట్ రెగట్టాతో పాటు, మే నెలలో ముంబైలో జరిగిన సెయిలింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ముంబై పోటీల్లో చూపిన అసాధారణ నైపుణ్యంతో గోవాలోని నేవీ స్పోర్ట్స్ స్కూల్, బెంగళూరులోని మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ సెంటర్ ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. కౌనిక్ వర్ధన్ చూపిన అంకితభావం, పట్టుదల, అసాధారణ సెయిలింగ్ నైపుణ్యాలే అతడిని ఈ స్థాయికి చేర్చాయన్నారు. గ్లోబల్ వేదికపై దేశ పతాకాన్ని ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న కౌనిక్ వర్ధన్‌కు గురుకుల సొసైటీ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు క్రీడాభిమానులు అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ



**కమలాపూర్, జులై 24 (నినాదం):** మండల ఉపసర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బోయిని శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అంబాలా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ యూత్ నాయకులు గండ్రకోట శ్రావణ్, బోయిని కార్తీక్, ఎర్రగొల్ల అజయ్, బోయిని నితిన్,కూకట్ల అజయ్,బోయిని గణేష్, గండికోట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి

● 8 మంది అరెస్ట్
● రూ.5,430 నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం



**భూపాలపల్లి ప్రతినిధి/కాటారం, జూలై 24(నినాదం):** కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని గ్రామ శివారులో పేకాట స్థావరంపై సిసిఎస్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గార ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఆకస్మికంగా దాడి చేపట్టారు. ఈ దాడిలో 8 మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 5,430 నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు. పోలీసుల దాడి జరుగుతున్న సమయంలో మరో ఒక నిందితుడు పరారైనట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాటారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓకు అప్పగించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్ ధర్నాకు భారీ ర్యాలీ బిఆర్ఎస్ శ్రేణులు

● మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి జులై 24( నినాదం ):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో నిరాడంబరంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో కేటీఆర్ నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున కార్ల ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, మారగోని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల అశోక్, రత్నగిరి శ్రీనివాస్, కుందూరు ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీప్లా, రావుల శ్రీనివాస రెడ్డి, మెరుగు గోపి, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, జమాల్ ఖాద్రి, దండంపల్లి సత్తయ్య, బొజ్జ వెంకటయ్య, తుమ్మల లింగస్వామి, కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్, తవిటి కృష్ణ, కంకణాల వెంకట్ రెడ్డి, అల్లి శివశంకర్, మామిడి పద్మ, మల్లికాంబ, ఉట్కూరు సందీప్ రెడ్డి, పెండెం ధనుంజయ్, కోట్ల జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**అమరచింత, జూలై 24 (నినాదం):** భారత రాష్ట్ర సమితి టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆత్మకూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్ మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మాజీ వైస్ ఎంపీపీ కోటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. సందర్భంగా రవికుమార్ యాదవ్, బంగారు శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణను ఐటీలో మేటిగా నిలిపిన డైనమిక్ యంగ్ లీడర్ కల్వకుంట్ల తారక రామారావు గొప్ప లీడర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గద్దమీది శ్రీనివాసులు, మండల రామకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు హసీం, షేక్ మహమూద్ పాషా, మాసన్న, రవీందర్, ఆకుల కురుమూర్తి తో పాటు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 57 శాతం వర్షపాత లోటు రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు

● ప్రత్యేక గ్రామసభల్లో రైతులకు ఎల్‌నినోపై అవగాహన



**పెబ్బేరు, జూలై 24 (నినాదం) :** ఎల్‌నినో ప్రభావంతో మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచించారు. శుక్రవారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో చెలిమిళ్ల ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి షేక్ మున్నా మాట్లాడుతూ, మండలంలో ప్రస్తుతం 57 శాతం వర్షపాత లోటు నమోదైందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉండే వరి సాగు చేపట్టడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకుని తక్కువ నీటితో సాగయ్యే కంది, పెసర, మినుము, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, ఆముదం వంటి మెట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణతో పాటు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పుష్పలత, రైతులు కృష్ణారెడ్డి, మోహన్, దేవన్న, బిచ్చుపల్లి గౌడ్, అంజి, రవి, బాలయ్య, కౌన్సిలర్లు భాగ్య శివకుమార్, తాటికొండ కృష్ణ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

● సర్పంచ్ నాగనాయక్



**దోర్నకల్ /మరిపెడ జులై 24(నినాదం):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని అందుకే ప్రభుత్వం సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వాల్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్ నాగ నాయక్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వాల్య తండా గ్రామపంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ పాలకవర్గం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని,గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని చెప్పారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా చేపట్టి ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రంలో ఉప సర్పంచ్ టాకిర్య నాయక్,వార్డ్ సభ్యులు,గ్రామ పెద్దమనుషులు,మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సేవాభావం

● రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరం



**మిర్యాలగూడ జులై 24(నినాదం ):** అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో తోటి మానవుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మిర్యాలగూడకు చెందిన చిరంజీవి చిట్యాల ప్రణీత్, తన తల్లిదండ్రులు శ్రీనివాస్, పద్మ లతో పాటు కుటుంబ సభ్యులు, మిత్రుల ప్రోత్సాహంతో సేవాభావాన్ని పెంపొందించుకుని, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీ సత్యసాయి సేవా సమితి, లయన్స్ క్లబ్ సహకారంతో ఈ ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం హౌసింగ్ బోర్డులోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని డాక్టర్ పందిరి రవీందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. రవి, డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ జానకి రాములు, డాక్టర్ జె. రాజు, మునీర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కూటాల. రాంబాబు, పి. గోవర్ధన్, కె. శ్రీధర్, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీనివాసరావు లు ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వచ్ఛంద రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజలు భద్రతా నియమాలు పాటించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 24(నినాదం):** విద్యుత్ వినియోగంలో ప్రజలు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని విద్యుత్తు శాఖ ఎస్ ఈ రమేష్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి సర్కిల్ పరిధిలోని రేగొండ సెక్షన్‌లోని నిజాంపల్లి గ్రామంలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ రమేష్ గ్రామస్థులకు విద్యుత్ లైన్లకు సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక కనెక్షన్లు తీసుకోవద్దని, ఎలాంటి లోపాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు అక్కాచెల్లెళ్ల ఎంపిక



**అమరచింత, జూలై 24, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఎండి రఫీ ఇద్దరు కూతుళ్ళు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీమ్ పేట కు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన ఎండి రఫీకు కుమార్తెలు సాధ్య బేగం, పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో అక్కాచెల్లెళ్లు పరీక్షలు రాసి విజయం సాధించారు. సాధ్యా బేగం నాల్గవ తరగతిలో సానియాబేగం ఐదో తరగతిలో చేరేందుకు స్పోర్ట్స్ స్కూల్ నుండి పిలుపు వచ్చింది. ఒకే పాఠశాలకు తమ కుమార్తెలు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## దామరచర్ల నాగుల చెరువు కబ్జాలపై లోకాయుక్త విచారణ



**మిర్యాలగూడ జూలై 24 (నినాదం):** నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని నాగుల చెరువు శిఖం భూమి కబ్జాలపై లోకాయుక్త ప్రత్యేక బృందం శుక్రవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. ఫిర్యాదు మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే, పోలీసు శాఖల అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించారు. చెరువు మొత్తం 95.27 గుంటల విస్తీర్ణంపై సమగ్ర నివేదికను ఆగస్టు 16లోగా సమర్పించాలని అధికారులను లోకాయుక్త బృందం ఆదేశించింది. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై పూర్తి వివరాలు నివేదికలో పొందుపరచాలని సూచించింది.

# గురుకుల పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### వనమహోత్సవంలో మొక్కలు నాటిన కలెక్టర్ కె. హరిత





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 24 (నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హరిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, బోధనా విధానాన్ని పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వంటశాల, భోజనశాలను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వంటశాలలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, నాటిన ప్రతి మొక్కను దత్తత తీసుకుని పెరిగే వరకు సంరక్షించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి కి గోదావరి తీరంలో పకడ్బందీ ఏర్పాట్లు

### మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్



**మంథని జూలై 24 (నినాదం) :** ఆషాడ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంథని గోదావరి తీరానికి పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి ఆయన గోదావరి తీరంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పుణ్య స్నానాల కోసం మంథని మండలం నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు గోదావరి పుణ్య స్నానాలు ఆచరించడానికి వస్తారని అన్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సాన ఘట్టాలను ఏర్పాటు చేయడంతో పాటు, షవర్లు,మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గోదావరి తీరంలో పరిశుభ్రంగా ఉండే విధంగా తీర ప్రాంతమంతా శుభ్రంగా చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లించడం జరిగిందన్నారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించి శుభ్రపరచడం జరిగిందన్నారు. తీరంలో విద్యుత్ లైట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రాత్రి సమయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గోదావరి ప్రాంతానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసుల సహాయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ సహకారంతో మంథనిలో గోదావరి తీరంలో అత్యాధునికంగా రూ. 20కోట్ల తో మహా ప్రస్థానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహా ప్రస్థానంలో అన్ని రకాల సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల గోదావరి తీరంలో ఉన్న మహాప్రస్థానం మాదిరిగానే మంథనిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జంబోజు సమ్మయ్య తదితరులు ఉన్నారు.

# రోడ్లు లేక.. రోజూ రోదనే.!

### ఎన్నికల హామీలు గాలిలో.. ప్రజల ఆశలు అగాధంలో
### మంత్రి గారూ ..కరుణ చూపయ్య..!



**మంచిర్యాల, జూలై 24(నినాదం) :** చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలంలో సర్వాయిపేట, ఎసన్వాయి, ఎడగట్ట, పిన్నారం, వంటి పలు గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో ఉదయం పిల్లలను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన. అనారోగ్యంతో ఉన్న వారిని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే కుటుంబ సభ్యులకు భయం... రైతు పండించిన పంటను మార్కెట్‌కు తరలించాలంటే కష్టాల పరంపర. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్తుల జీవితం రోజురోజుకూ దుర్భరంగా మారుతోంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారులు గుంతలమయంగా మారింది. వర్షం కురిస్తే బురద చెరువులా మారుతుండగా, ఎండాకాలంలో దుమ్ము మేఘాలు కమ్మేస్తున్నాయి. దీంతో నిత్యం ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి క్షణం ప్రమాద భయంతో ప్రయాణిస్తుండగా, ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ప్రతి రోజు మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో పాఠశాలలకు వెళ్లడమే ఒక సాహసంగా మారుతోంది. చిన్నారులను పాఠశాలకు పంపే తల్లిదండ్రులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. రైతుల కష్టాలు చెప్పలేనివి. ధాన్యం, పత్తి, కూరగాయలు వంటి పంటలను మార్కెట్‌కు తరలించేందుకు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోంది. దెబ్బతిన్న రహదారి కారణంగా కొంతమంది వాహన యజమానులు గ్రామంలోకి రావడానికి నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో పంటకు గిట్టుబాటు ధర వచ్చినా, రవాణా సమస్యలతో నష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితి మరింత విషమంగా మారుతోంది. గర్భిణులు, వృద్ధులు ఈ రహదారిపై ప్రయాణించడం ఎంతో ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రహదారి నిర్మాణంపై ప్రజాప్రతినిధులు ఎన్నో హామీలు ఇచ్చినా, ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీలు గాలిలో కలిసిపోయాయి. అధికారులు పలుమార్లు పరిశీలించి వెళ్లినా పనులు మాత్రం ప్రారంభం కాలేదని వారు అంటున్నారు. మంచి రహదారి అంటే కేవలం ప్రయాణానికి మాత్రమే కాదు... అది విద్యార్థుల భవిష్యత్తుకు బాట, రైతు కష్టానికి గిట్టుబాటు, అత్యవసర సమయంలో ప్రాణాలకు భరోసా ఉంటుంది. మంత్రి వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి రహదారి నిర్మాణాన్ని చేపట్టి గ్రామ ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లిఅత్యవసర సేవలకు ఆటంకం... పలు గ్రామాల్లో సరైన రహదారులు లేకపోవడం వల్ల అత్యవసర వైద్య సేవలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అనారోగ్యానికి గురైన వారు లేదా ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడేందుకు వచ్చే 108 అంబులెన్స్‌లు గ్రామాలకు సమయానికి చేరుకోలేకపోతున్నాయి. గుంతల రహదారులు, బురద మార్గాలు, వాగులు దాటాల్సిన పరిస్థితుల కారణంగా అంబులెన్స్‌లు ఆలస్యంగా చేరడం వల్ల రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. గర్భిణులు, వృద్ధులు, ప్రమాద బాధితులు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను కాపాడే 108 సేవలు సకాలంలో అందాలంటే ముందుగా గ్రామాలకు నాణ్యమైన రహదా రులు నిర్మించాలని గ్రామస్థులు కోరుతు న్నారు. ఇప్పుడే ఇప్పటికైనా మంత్రిగారి స్పందించి శాశ్వత ప్రతిపాదికన రోడ్లు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# హైదరాబాద్-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, బెల్లంపల్లి-గడ్చిరోలి రహదారి పనులు చేపట్టాలి

### గడ్కరీతో హరీష్ బాబు భేటీ



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 24(నినాదం) హైదరాబాద్-నాగపూర్ మధ్య కొత్త గ్రీన్‌ఫీల్డ్ యాక్సిస్ కంట్రోల్డ్ జాతీయ రహదారి నిర్మాణంతో పాటు బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోని మంత్రి అధికారిక నివాసంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్చిరోలి జిల్లాలో ఐరన్ ఓర్ గనుల కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో అక్కడి నుంచి హైదరాబాద్ వం-కు ముడి ఇనుము రవాణాకు బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి అత్యంత కీలకమని ఎమ్మెల్యే వివరించారు. అలాగే హైదరాబాద్‌ల-నాగపూర్ మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రవాణా వేగవంతం కావడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. వినతిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, కేంద్ర రవాణా శాఖ అధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



### ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

**మంథని జూలై 24( నినాదం) :** బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు శుక్రవారం బీఆరెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాగేపల్లి చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన అనంతరం బేగంపేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పరితపించే కేటీఆర్ ఢిల్లీలో ఉద్యమం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా తన పుట్టినరోజు వేడుకలను రద్దు చేసుకుని హైదరాబాద్ లో నిరసన కార్యక్రమం చేపట్టిన ప్రజాబాంధవుడు అని కొనియాడారు. మాజీ రైతుబంధు అధ్యక్షుడు మేధరవేన కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఐటీ మినిస్టర్ గా విశేష సేవలందించిన కేటీఆర్ అనేక ఐటీ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగం అవకాశాలు కల్పించాడని గుర్తుచేశారు. కెసిఆర్ ను ముఖ్యమంత్రిని చేయడం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని బీఆరెస్ ప్రభుత్వంలో కేటీఆర్ మళ్ళీ మంత్రిగా నిరుద్యోగులకు అండగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా మంథని పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో టిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ గ్రామశాఖ అధ్యక్షులు కాపురవేన భాస్కర్, గద్దల శంకర్, రాచకొండ లక్ష్మణ్, తుమ్మల అశోక్, వీఏపీ సది, బత్తిని ప్రశాంత్, నాయకులు వేగోలపు శ్రీనివాస్ గౌడ్, గాజుల ప్రసాద్, బుర్ర శంకర్, మేడగొని రాజన్న, రొడ్డ శ్రీనివాస్, ధర్మల రాజసంపత్, దామెర శ్రీనివాస్, బూరుగు రాజు, గద్దల ఓదెలు, బొంకూరి పోశం, బొంగురాల రవీందర్, బీసగోని శ్రావణ్, కొమురయ్య, ఓదెలు, ఆయిందాల రమేష్, రేండ్ల కుమారస్వామీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రధాన ఆకాంక్ష

### వారాహి హోమంలో మేయర్ దంపతులు



**మంచిర్యాల, జులై 24 (నినాదం):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గా దేవాలయంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక వారాహి హోమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మధుకర్ సుజాత దంపతులు, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ దంపతులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన హోమంలో మేయర్ దంపతులు పూర్ణాహుతి సమర్పించి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి నెలకొని, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు సహా ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. హోమం అనంతరం ఆలయ అర్చకులు మేయర్ దంపతులకు వేదాశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొనగా, నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే వారాహి నవరాత్రి ఉత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించడం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, మహిళా భక్తులు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# దేవాలయయల నిర్మాణానికి నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**నిర్మల్ ప్రతినిధి, జూలై 24 (నినాదం ):** భైంసా మండలం లోని కోతుల్ గాం, కుంసర, కుంటాల మండలం లోని లింబా (బి ) గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పాటు టెండర్ ప్రక్రియ పూర్తి కావడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు శుక్రవారం భైంసా లోని తన నివాసం లో అయన ఈ విషయాన్ని వెల్లడించారు. లింబా బి గ్రామం లో శివాలయ నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులు, భైంసా మండలం లోని కోతుల్ గ్రామం లో బీరప్ప ఆలయానికి 10 లక్షల రూపాయల నిధులు కుంసర గ్రామం లో హనుమాన్ ఆలయానికి 10 లక్షల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు.. నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి, ఇంచార్జి మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కి కృతజ్ఞతలు చెప్పారు.

# పాడె మోసి అనుబంధం చాటిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

### అశ్రునయనాలతో మల్లారెడ్డికి వీడ్కోలు



**మంచిర్యాల, జూలై 24 (నినాదం):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, ముల్కల మల్లారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం మంచిర్యాల లోని ఆయన నివాసానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి స్వయంగా పాల్గొని పాడె మోసి మల్లారెడ్డికి చివరి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముల్కల మల్లారెడ్డి జీవితాంతం పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. 2013లో భారతీయ జనతా పార్టీలో చేరిన ఆయన, 2014 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, కార్యకర్తలను సమన్వయం చేయడంలో మల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నా రు. ఆయన మరణంతో బీజేపీ ఒక సమ ర్థుడైన నాయకుడిని, నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని పేర్కొన్నారు. ముల్కల మల్లారెడ్డి కుటుంబానికి భారతీయ జనతా పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి హామీ ఇచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ముల్కల మల్లారెడ్డికి అశ్రునివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నేతలు నివాళులర్పించారు.

# పోక్సో కేసుల్లో రాజీ లేదు.. నిందితులకు శిక్షలే లక్ష్యం

### సుల్తానాబాద్ సర్కిల్ తనిఖీలో డీసీపీ బి. రామ్‌రెడ్డి స్పష్టం





**సుల్తానాబాద్, జూలై 24 (నినాదం):** పెద్దపల్లి జోన్ పరిధిలోని సుల్తానాబాద్ సర్కిల్ కా ర్యాలయాన్ని డీసీపీ బి. రామ్‌రెడ్డి, ఐపీఎస్ శుక్ర వారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గ్రేవ్ కేసులు, పోక్సో కేసులు, పెండింగ్ ట్రయల్ కే సుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోక్సో సహా గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన, వేగవంతమైన ద ర్యాప్తు నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ వారి కదలికలను ని రంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా స్వాగతించి, సమస్యలపై వెంటనే స్పందించాలని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంచేలా పారద ర్శకంగా సేవలు అందించాలని డీసీపీ సూచిం చారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, సామాజిక అంశా లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చైత న్యం తీసుకురావాలని ఆదేశించారు. తనిఖీల అ నంతరం డీసీపీ పోలీసు అధికారులతో కలిసి స్టే షన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమం లో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, సర్కిల్ పరిధిలోని ఎ స్‌ఐలు చంద్రకుమార్, మధు, సన్నత్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ ద్వారా నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష
### ఆగస్టు 1 నుంచి పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జ్ నిర్మాణ పనులు ప్రారంభించాలి
### తెలంగాణ జలసిరి, వీబీజీ రామ్ జీ అమలు పై సమీక్ష నిర్వహించిన కలెక్టర్





**పెద్దపల్లి రూరల్,జూలై22(నినాదం):** సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలను పరిరక్షించడం అత్యంత ప్రాధాన్యమని, తెలంగాణ జలసిరి కార్యక్రమం,వీబీజీ రామ్ జీ పథకం ద్వారా నీటి సంరక్షణ నిర్మాణాలను గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చేపట్టాలని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికా రులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి కార్యక్రమం, వీబీజీ రామ్ జీ పథకం అమలు పై ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో చేపట్టాల్సిన నీటి సంరక్షణ పను లు,స్థలాల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభంపై అధికారులకు పలు దిశానిర్దే శాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీ రామ్ జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు సంబంధించిన నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట కుంటలు,ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన స్థలాలను వెంటనే గుర్తిం చి, పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి,ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే విధంగా నీటి సంరక్షణ చర్యలను మిషన్ మోడ్‌లో అమలు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి సంరక్షణ నిర్మాణాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,పనులు నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామపం చాయతీలు, మండల స్థాయి అధికారులు సమన్వ యంతో పనిచేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయా లని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్,డి. ఆర్. డి. ఓ. కాళిందిని,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవే లక్ష్యంగా పనిచేసిన శ్రీధర్ రావు సేవలు చిరస్మర ణీయం

### కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ రావుకు ఆత్మీయ సన్మానం
### పిఏసిఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్
### సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, బ్యాంకు,సొసైటీ సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభ





**సుల్తానాబాద్, జూలై 24 (నినాదం):** సుల్తానాబాద్ కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్‌రావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండలంలోని స హకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కే డీసీసీ బ్యాంకు సిబ్బంది, సొసైటీ ఉద్యోగులు కలి సి ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి సుల్తానాబాద్ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీధ ర్‌రావు నాలుగున్నర సంవత్సరాల పదవీ కాలం లో రైతులకు, సహకార సంఘాలకు అందించిన సే వలు, బ్యాంకు అభివృద్ధికి చేసిన కృషిని కొనియా డారు. బాధ్యతాయుతమైన సేవాభావంతో ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ విశేష గు ర్తింపు పొందారని పేర్కొన్నారు. అనంతరం శ్రీధర్ రావును శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయన కొత్త బాధ్యత ల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాల ని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో గర్రెపల్లి సొసైటీ చైర్మన్ కల్లెపల్లి జానీ, చిన్న కల్వల మాజీ చైర్మన్ మోహన్ రావు, సీఈఓ లు బుర్ర సంతోష్,వల్ల కొండ రమేష్, సతీష్, బొంగోని దేవేందర్ గౌడ్, నబీరుద్దీన్ , బ్యాంకు అధికారులు, సొసైటీల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ్ నగర్ వార్డ్ నంబర్ 16 లో కోతుల పట్టివేత



**నిర్మల్ ప్రతినిధి, జూలై 24 ( నినాదం):** నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ వశిష్ట హై స్కూల్ లో నిర్వహించిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమంలో మొత్తం 40 కోతులను పట్టుకొని రంగులు చల్లి కవ్వాల్ అటవీ ప్రాంతానికి సురక్షితం గా తరలించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. స్థానిక కౌన్సిలర్ రావులవార్ విట్టల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీరామోజీ రాజు, సత్యనారాయణ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత

## ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క





**మణుగూరు, జూలై24 (నినాదం):** సింగరేణి ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వముఅత్యంత ప్రాధాన్యతను ఇస్తామని, కార్మికులు గాని స్థానికులు గాని ఎటువంటి ఆందోళన గురి కావాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి షవిక్రమార్క స్పష్టం చేశారు. శు క్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో సింగరేణి గనుల ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించి సింగరేణి సమాచారాన్ని పూర్తిగా అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ముందుగా ఓసి టు ఓపెన్ కాస్ట్ గనిలో పర్యటించి బొగ్గు నాణ్యతను ఉత్పత్తి శాతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతను పెంచుతూ అధిక శాతం బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని ఆయనఅధికారులనుఆ దేశించారు. కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. మణుగూరు ప్రకాశం ఓపెన్ కాస్ట్ గనినిసందర్శించిన ఉపముఖ్యమంత్రి పీకే టు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనినిక్షేత్ర స్థాయిలో సందర్శించి గని పనితీరును, బొగ్గు ఉత్పత్తిని, నాణ్యతను సింగరేణి సంస్థభవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహిం చారు. అనంతరం 1976లో మణుగూరు ప్రాంతంలో ప్రారంభమైన ఈ గని చరిత్ర ఇప్పటివరకు జరిగిన బొగ్గు ఉత్పత్తి ప్రస్తుతం అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలు, గని జీవిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నుముక లాంటి సంస్థని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని బొగ్గు నిల్వల పెంపు, ఉత్పత్తి విస్తరణ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో బొగ్గు కొత్త గనులు కేటాయింపుకు సంబంధించి నిర్వహించే వేలం ప్రక్రియలో సింగరేణి సంస్థ చురుగ్గా పాల్గొని, కొత్త గనుల బ్లాకులను సొంతం చేసుకునేందుకు సమగ్ర కార్యచరణ తో ముందుకు సాగాలని ఆయన అధికారులను ఆదేశించారు. పోటీ ప్రపంచంలో సింగరేణి తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ దేశంలోనే అగ్రగామిగా బొగ్గు ఉత్పత్తి ని పెంచుతూ పోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే తాడిచర్ల బొగ్గు బ్లాక్ సింగరేణి కేటాయించడంతో సంస్థ వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు కార్మికుల్లో ఆనంద వెల్లువిరుస్తుందని ఆయన అన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు ఉత్పత్తి అవసరాలు దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పీకే ఓసి డిప్ సైడ్ బ్లాక్ ను కూడా సింగరేణికే కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మెటల్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఎస్సీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్, టీఎస్ జెన్కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఎస్సిసిఎల్ డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ వెల్ఫేర్ అధికారి గౌతమ్ పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేటీఆర్ సేవలు

## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్





**గోదావరిఖని, జూలై 24(నినాదం):** తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామగుండంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మొక్కల నాటడం, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ, డయాలసిస్ రోగులకు ఆర్థిక సహాయం, రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం, ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కేటీఆర్‌కు తెలంగాణ సమాజం అండగా నిలవాలని కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కౌశిక్ హరి, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, మూల విజయారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, మేకల సమ్మయ్య యాదవ్, కర్క పద్మజ, తోకల రమేష్, మెతుకు దేవ రాజ్, నూతి తిరుపతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఈదునూరి పర్వతాలు, కృష్ణవేణి, ఈదునూరి శ్రీకాంత్, కిరణ్ జి, చింటూ, దొమ్మేటి వాసు, కనుకరాజు, సాజీదా, పద్మ, కర్రావుల రామరాజు, కోల సంతోష్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులను అంచనా వేసి రైతులను అప్రమత్తం చేయాలి

**వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి**

**నాగర్‌కర్నూలు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ జూలై 24 ( నినాదం ) :** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులను అప్రమత్తం చేయడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంపై ప్రభావం, భూగర్భ జలాల లభ్యత, నీటి సంరక్షణ చర్యలు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన వర్షపాతం, సాధారణ వర్షపాతంతో పోలిస్తే లోటు, మండలాల వారీ పరిస్థితులు, భూగర్భ జలాల మట్టాలు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, గత ఏడాది సాగైన పంటలు, ఈ ఖరీఫ్ సీజన్ సాగు లక్ష్యాలు, రైతుల పంటల ఎంపికపై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్‌నినో ప్రభావాన్ని తేలికగా తీసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిర్ణయాలు తీసుకునేలా మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. వర్షాభావానికి గురయ్యే అవకాశం ఉన్న మండలాలు, గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వాతావరణ శాఖ అంచనాలను రైతులకు వెంటనే చేరవేసి, వర్షపాతం, నేల తేమ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగా సాగు సూచనలు అందించాలని తెలిపారు. అధిక నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా పత్తి, కందులు, మినుములు, పెసలు, ఉలవలు, జొన్నలు, సజ్జలు, రాగులు, ఇతర చిరుధాన్యాలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితో మంచి దిగుబడి ఇవ్వడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని, భూసారాన్ని కూడా పరిరక్షిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, పంటల బీమా, మార్కెటింగ్ అవకాశాలు, కనీస మద్దతు ధరలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతుల్లో ఉన్న అపోహలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలపై విశ్వాసం పెంపొందించాలని సూచించారు. నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి వనరుల మ్యాపింగ్ నిర్వహించి, నీటి వినియోగంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావిస్తూ నీటి వృథాను అరికట్టేందుకు 'జల ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని, భూగర్భ జలాలను అవసరానికి అనుగుణంగా మాత్రమే ఉపయోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాభావ ప్రభావం వ్యవసాయంతో పాటు తాగునీరు, పశుసంవర్ధక రంగం, గ్రామీణ జీవన విధానంపై కూడా పడుతుందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా రైతులకు వర్షాభావ పరిస్థితులు, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వ పథకాలు, పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు దేవ సహాయం, చెన్నయ్యతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ**


**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్‌రావుకు సంఘం ప్రతినిధుల వినతిపత్రం అందజేత**



**కరీంనగర్, జులై24(నినాదం) :** నగరంలోని భగత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం ప్రతినిధులు శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, 2012లో స్థాపితమైన భగత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం భగత్‌నగర్, కట్టరాంపూర్, కార్తికేయనగర్, అయోధ్యకాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 800 మంది సభ్యులతో సామాజిక, సాంస్కృతిక, విద్యా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘానికి శాశ్వత భవనం నిర్మించాలనే లక్ష్యంతో రామచంద్రాపూర్ కాలనీ రోడ్డు నెం. 21లో స్థలం కొనుగోలు చేసి, సభ్యుల విరాళాలతో తొలి దశ నిర్మాణాన్ని పూర్తి చేశామని పేర్కొన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం లేదా అందుబాటులో ఉన్న పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. భవనం పూర్తయితే సామాజిక సమావేశాలు, విద్యార్థులు, యువత, మహిళల సంక్షేమ కార్యక్రమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని వివరించారు. వినతిపై స్పందించిన యాదగిరి సునీల్‌రావు, భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, భవన నిర్మాణం పూర్తయ్యేలా అవసరమైన సహకారం అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లయ్యగారి ఇంద్రారెడ్డి, కోశాధికారి చెరుకుపల్లి కనకారెడ్డి, ఉపాధ్యక్షులు ముదుగంటి దామోదర్‌రెడ్డి, సంది జలపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు దేవసాని కిరణ్‌కుమార్‌రెడ్డి, కరివేద శ్రీనివాస్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి కాంతాల తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఇనుకొండ సుధాకర్‌రెడ్డి, కాసం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA

# మరో డిఫరెంట్ ప్రేమకథ.. చెన్నై లవ్ స్టోరీ




కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిం దన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదా సులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్ధంలో దర్శకు డు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినో దాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందర గోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయ కత్వం, చలాకీతనం సహజంగా ఉంటా యి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికిం చాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమా కు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందా గా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి.



# రణబలి విడుదలపై అయోమయం

## దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం




కథానాయకుడు విజయ్ దేవరకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చనే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 – 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ – అతుల్ సంగీతమందిస్తున్నారు.

# విశ్వనాథ్ అండ్ సన్స్...తమిళ సినామానే

## తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తున్నాం





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్యకు జోడీగా యువ నటి మమితా బైజు నటిస్తుండగా, ఆగస్టు 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరవ డుతున్న నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా ఇచ్చిన ఓ ఇంట ర్వ్యూలో ఈ సినిమాపై చాలా రోజులుగా ప్రచారంలో ఉన్న ఒక ముఖ్యమైన విషయానికి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటివరకు ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి చిత్రీకరించిన ద్విభాషా సినిమాగా చాలా మంది భావించారు. అయితే అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్‌ను పూర్తిగా తమిళ భాషలో మాత్రమే చిత్రీకరించాం. తర్వాత తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేస్తున్నాం. ఇది బైలింగ్వల్ సినిమా కాదు' అని వెల్లడించారు. దీంతో ఈ చిత్రంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తెలుగు నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న కారణంగా ఈ సినిమాను చాలా మంది తెలుగు–తమిళ ద్విభాషా చిత్రంగా భావించారు. కానీ దర్శకుడి తాజా వ్యాఖ్యలతో ఇది తమిళ చిత్రంగానే రూపొంది, తెలుగులో డబ్ అవుతున్న సినిమా అని స్పష్టమైంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు, సూర్య స్టైలిష్ లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపిన కథతో ఈ సినిమా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.






# మంగళవారం మూవీకి సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు.



# అమెరికా ప్రచారంలో రామాయణ టీమ్

దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతోన్న ప్రముఖ శాన్ డియాగో కామిక్–కాన్ 2026 వేడుకల్లో చిత్ర బృందం పాల్గొని సందడి చేసింది. రణ్‌బీర్ కపూర్, యశ్, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు నిర్మాత నమిత్ మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్‌పై యశ్ ప్రశంసలు కురిపించారు. 'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. రణ్‌బీర్ కపూర్ గొప్పగా నటించాడు. ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసినప్పుడు అతడి నిబద్ధత కనిపిస్తుంది. ఇలాంటి సినిమాను చిత్రీకరించాలంటే సంకల్ప బలం ఉండాలి. మంచి టీమ్ ఉన్నప్పుడు ప్రతీది కలిసి వస్తుంది. ఈ సినిమా ప్రారంభించాక జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాం. మేకప్ నుంచి లుక్స్ వరకూ సాంకేతికంగా ఇది ఎంతో సవాలుతో కూడుకున్న పని. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని యశ్ అన్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787